
పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏవైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
A.C.O - 9003200801
S.R - 9551168092
ఆంధ్రజ్యోతి చిరునామా : జి4, గ్రౌండ్ ఫ్లోర్, రామ్స్ అపార్ట్‌మెంట్, ఓల్డ్ నెం. 40, న్యూ నెంబర్ 35, విజయ రాఘవ రోడ్డు, టి.నగర్, చెన్నై - 600 017

రేపిస్టుల బరితెగింపు

- పోలీసులపై దాడి
- ఆత్మరక్షణార్థం ఖాకీల కాల్పులు
- నిందితులు పాత నేరస్తులే

కోవైలో ఓ కాలేజీ విద్యార్థినిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ముగ్గురు దుండగులు 24 గంటల్లోనే పట్టుబడ్డారు. అయితే తమ కోసం వచ్చిన పోలీసులపై దుండగులు కత్తితో దాడి చేయగా, అందులో ఓ కానిస్టేబుల్ గాయపడగా, ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు నిందితుల కాళ్లలోకి తూటాలు వెళ్లాయి. దేశవ్యాప్తంగా సంచలనం రేపుతున్న ఈ వ్యవహారం వివరాలిలా వున్నాయి...

- (చెన్నై,ఆంధ్రజ్యోతి)



కోయంబత్తూరు ఒండిపుదూరు ప్రాంతంలో మొబైల్ షాపు నడుపుతున్న యువకుడు (23), ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్న 21 యేళ్ల యువతి గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. రోజూ ఈ జంట శివారు ప్రాంతాలకు షికారుకు వెళ్లి అర్ధరాత్రి దాటాక ఇళ్లకు తిరిగి వచ్చేవారు. ఈ నేపథ్యంలోనే ఎప్పటిలానే ఆదివారం రాత్రి 11 గంటలకు కోయంబత్తూరు ఎయిర్‌పోర్ట్ వెనుకవైపు కారులో వెళ్లారు. వీరిద్దరూ కారులో కూర్చుని మాట్లాడుకుంటుండగా మద్యం మత్తులో మోటారుసైకిల్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు.. కారు ముందు అద్దాన్ని పగులగొట్టారు. అనంతరం ఆ యువకుడిని బయటకు లాగి దాడి చేశారు. అతను స్పృహ తప్పాక, ఆ యువతిపై దాడి చేశారు. అనంతరం ఆ యువతిని బయటకు లాగి, పక్కనే వున్న పొదల్లోకి ఈడ్చుకెళ్లారు. అక్కడ ముగ్గురు వ్యక్తులు ఆమెపై సామూహిక అత్యాచారం పాల్పోయారు. సోమవారం ఉదయం స్పృహలోకి వచ్చిన ఆ యువకుడు మొబైల్ ఫోన్‌తో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అక్కడికి చేరుకున్న పోలీసులు .. ఆ యువకుడిని కోయంబత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి, పరిసర ప్రాంతాల్లో సుమారు ఐదు గంటలపాటు గాలించగా, చివరకు రైలుపట్టాల సమీపంలో ఓ ముళ్ల పొదవద్ద స్పృహలేకుండా నగ్నంగా ఆ యువతి కనిపించింది. ఆమె శరీరమంతా గాయాలతో పాటు ముళ్లు గుచ్చుకుని రక్తమోడివుంది. దాంతో పోలీసులు ఆమెను అంబులెన్స్‌లో సమీపంలో వున్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కోయంబత్తూరు డిప్యూటీ కమిషనర్ దేవనాథన్, అసిస్టెంట్ కమిషనర్ వేల్‌మురుగన్ నేతృత్వంలోని పోలీసులు సోమవారం సాయంత్రం వరకు ఘటనాస్థలంలో విచారణ జరిపారు. దుండగుల ఆధారాల కోసం ఆ చుట్టుపక్కల గాలించారు. విద్యార్థిని అత్యాచారానికి గురైన ప్రాంతానికి ఫోరెన్సిక్ నిపుణుల రప్పించి ఆనవాళ్లను సేకరించారు. ఆ దుండగులు వాడిన బైకు ఘటనాస్థలికి కి.మీ. దూరంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ బైకు చోరీ వాహనంగా తేలింది. దీంతో ఆ జంటను నిశితంగా గమనించినవారే పక్కా ప్రణాళికతో అత్యాచారానికి ఒడిగట్టి వుంటారని పోలీసులు గ్రహించారు. ఆ ముగ్గురి ఆచూకీ కోసం ఏడు ప్రత్యేక పోలీసు బృందాలు రంగంలోకి దిగిన విషయం తెలిసిందే.


నిందితుల అరెస్టు వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న కోవై సిటీ పోలీసు కమిషనర్ శరవణసుందర్

ఎదురు దాడితో ఉద్రిక్తత..

కోయంబత్తూరు శివారు ప్రాంతమైన వెళ్లకినరు పట్టత్తరసి అమ్మన్ ఆలయం వద్ద ముగ్గురు నిందితులు దాగివున్నట్లు గ్రహించిన పోలీసులు.. సోమవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో వారిని చుట్టుముట్టారు. పోలీసులను గమనించిన దుండగులు వేటకొడవళ్లతో దాడికి దిగారు. ఆ దాడిలో హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్ ఎడమ చేతి మణికట్టు తీవ్రగాయమైంది. వెంటనే పోలీసులు ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపారు. తూటాలు ముగ్గురి కాళ్లలోకి దూసుకెళ్లటంతో వారు అక్కడ కుప్పకూలారు. ఆ తర్వాత పోలీసులు ఆ ముగ్గురినీ చికిత్స నిమిత్తం కోయంబత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నిందితుల గుర్తింపు...

కాలేజీ విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన ముగ్గురి అరెస్టుకు సంబంధించి కోయంబత్తూరు నగర పోలీసు కమిషనర్ శరవణ సుందర్ మీడియా సమావేశంలో వివరించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నేరస్తులను సులువుగా గుర్తించగలిగినట్లు ఆయన చెప్పారు. ఈ అత్యాచారం కేసులో శివగంగ జిల్లాకు చెందిన సతీష్ , కార్తీ , మదురైకి చెందిన గుణాను తుపాకీతో కాల్పులు జరిపి అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ ముగ్గురిపై పీలమేడు, కోవిల్‌పాళయం సింగానల్లూరు, తుడియలూరు, కినత్తుకడవు, సూలూరు, సత్యమంగళం, తిరుమురుగన్ పూండి పోలీసుస్టేషన్లలో హత్య, వాహనాల చోరీ కేసులు న్నట్లు చెప్పారు. ముగ్గురూ అవివాహితులని, ఇరుక్కూరు ప్రాంతంలో ఉంటూ చోరీలకు పాల్పడుతుండేవారని తెలిపారు.

ఈ అత్యాచారం కేసుకు సంబంధించి నగరం నలువైపులా సుమారు వంద మంది పోలీసులు విచారణ జరిపారని, 300లకు పైగా సీసీ కెమెరాల్లో నమోదైన ఫుటేజీ పరిశీలించారని తెలిపారు. కోవిల్‌పాళయంలో ఓ ఇంటి ఎదుట పార్కింగ్ చేసి ఉన్న మోటారు సైకిల్ని అపహరించి, పీకల దాకా మద్యం సేవించి ఈ దారుణానికి పాల్పడ్డారని వివరించారు. అరెస్టయిన ముగ్గురిపై గూండా చట్టం ప్రయోగించే దిశగా చర్యలు చేపడతామన్నారు. అత్యాచారం జరిగిన ప్రాంతంలో పోలీసులు రోజూ గస్తీ తిరుగుతుంటారని, ఆదివారం రాత్రి జనసంచారం లేకపోవడంతో వెళ్లలేదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. దుండగులు ముగ్గురూ కాలేజీ విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన తర్వాత ఆమె వద్దనున్న సెల్‌ఫోన్ చోరీ చేశారని, ఆ సెల్‌ఫోన్ నెట్‌వర్క్ సిగ్నల్ ఆధారంగా వారిని వెంటాడామని వివరించారు.

శెభాష్ పోలీస్: సీఎం

అత్యాచారానికి పాల్పడిన నిందితులను 24 గంటల్లోగా పట్టుకున్న పోలీసులను సీఎం స్టాలిన్ అభినందించారు. నేరస్తులకు కఠిన శిక్ష పడేలా పూర్తయ్యేలా చర్యలు చేపడతామన్నారు. అంతేగాకుండా బాధితురాలికి మానసిక నిపుణులతో కౌన్సిలింగ్ ఇప్పిస్తామని, ఆమెకు అన్ని విధాలుగా అండదండలు అందిస్తామని సీఎం పేర్కొన్నారు.

డీఎంకే ఉప ప్రధాన కార్యదర్శులుగా
పొన్ముడి, స్వామినాథన్




ప్యారీస్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీకి మరో ఐదు నెలల్లో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో డీఎంకే కొంతమంది సీనియర్లకు మళ్లీ బాధ్యతలు అప్పగిస్తోంది. ఆ పార్టీలో ఇప్పటికే ఐదుగురు ఉపప్రధాన కార్యదర్శులుండగా, మరో ఇద్దరిని నియమించింది. ఇటీవల మహిళలను కించపరిచేలా వ్యాఖ్యానించి వివాదంలో చిక్కుకుని మంత్రి పదవి కోల్పోయిన సీనియర్ నేత పొన్ముడి, రాష్ట్ర సమాచారశాఖ మంత్రి స్వామినాథన్‌లను పార్టీ ఉపప్రధాన కార్యదర్శులుగా పార్టీ అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ నియమించారు. ఎంపీ కనిమొళి, మంత్రి ఐ.పెరియస్వామి, రాజ్యసభ సభ్యుడు తిరుచ్చి శివ, మరో ఎంపి ఆర్.రాజా, మాజీమంత్రి ఆందియూర్ సెల్వరాజ్‌లతో కలిసి వీరిద్దరూ పార్టీ వ్యవహారాలు చూస్తారు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ తరుపున నిర్వహించాల్సిన పనుల పర్యవేక్షణకు అధికార డీఎంకేలో త్వరలోనే మరికొంత మంది సీనియర్లకు పార్టీలో పదవులు కట్టబెట్టనున్నట్లు సమాచారం. మంత్రి ఎంపీ.స్వామినాథన్ నిర్వహించిన తిరుప్పూర్ ఈస్ట్ జిల్లా పార్టీ పదవికి పద్మనాభన్, తిరుప్పూర్ దక్షిణ జిల్లా పార్టీ ఆర్గనైజర్‌గా ఈశ్వరస్వామి నియమితులయ్యారు. అదేవిధంగా వేలూరు జిల్లాను పార్టీపరంగా వేలూరు నార్త్, వేలూరు సౌత్‌గా విభజించారు. వేలూరు సౌత్ (వేలూరు, అనైకట్టు, గుడియాత్తం) జిల్లా కార్యదర్శిగా ఏపీ నందకుమార్, వేలూరు నార్త్ (కాట్పాడి, కీల్‌వైద్యానాన్‌కుప్పం) జిల్లా కార్యదర్శిగా సీనియర్ మంత్రి దురైమురుగన్ కుమారుడు ఎంపీ కదిర్ ఆనంద్‌లను నియమించినట్లు డీఎంకే అధిష్టానం మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

డీఎంకే తీర్థం పుచ్చుకున్న ఎమ్మెల్యే మనోజ్ పాండ్యన్


మనోజ్ పాండ్యన్‌కు పార్టీ కండువా కప్పుతున్న డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్

చెన్నై, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే బహిష్కృత నేత, తెన్‌కాశి జిల్లా ఆలంకుళం నియోజకవర్గం శాసనసభ్యుడు, మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం అనుచరుడైన మనోజ్ పాండ్యన్ మంగళవారం డీఎంకే పార్టీలో చేరారు. తేనాంపేటలోని అన్నా అరివాలయానికి వెళ్లిన మనోజ్ పాండ్యన్.. డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సమక్షంలో ఆ పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. ఆయనకు శాలువా కప్పిన స్టాలిన్.. పార్టీలోకి సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దురైమురుగన్, కేఎన్ నెహ్రూ, ఎంఆర్కే పన్నీర్‌సెల్వం, పీకే శేఖర్‌బాబు, ఎంపీ కనిమొళి, పూచ్చిమురుగన్, ఆర్ఎస్ భారతి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం మనోజ్ పాండ్యన్ అరివాలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. డీఎంకేలో చేరటం వల్ల తన శాసనసభ్యత్వానికి రాజీనామా చేయనున్నట్లు తెలిపారు. డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ సమర్థవంతంగా ద్రావిడ హక్కులను పరిరక్షిస్తూ, రాష్ట్ర హక్కులను కాపాడుతుండడం వల్లే తాను ఆ పార్టీలో చేరానని తెలిపారు. అన్నాడీఎంకే ప్రస్తుతం బీజేపీ కార్యాలయంగా మారిందని ఆయన విమర్శించారు.

అన్నాడీఎంకేలో చేరలేక..

మనోజ్‌పాండ్యన్ 2001లో చేరన్‌మహాదేవి నియోజకవర్గంలో, 2021లో ఆలంకుళం నియోజకవర్గంలో అన్నాడీఎంకే తరపున పోటీ చేసి గెలిచారు. 2010 నుండి 2016 వరకు రాజ్యసభ సభ్యుడిగా వ్యవహరించారు. మాజీ ముఖ్యమంత్రి ఓపీఎస్‌కు మనోజ్‌పాండ్యన్ కుడిభుజంగా వ్యవహరించారు. శశికళపై ఓపీఎస్ తిరుగుబాటు చేసినప్పుడు ఆయన వెంటే నిలిచారు. ఆ తరువాత ఈపీఎస్ నేతృత్వంలో అన్నాడీఎంకేలోకి ఓపీఎస్ వచ్చినప్పుడు ఆయన వెంటే నడిచారు. అదే సమయంలో ఓపీఎస్‌ను పార్టీ నుంచి బహిష్కరించినప్పుడు కూడా పెద్ద ఎత్తున గళమెత్తారు. ఓపీఎస్‌తో పాటు అన్నాడీఎంకే నుంచి బహిష్కృతులయ్యారు. కొంతకాలంగా అన్నాడీఎంకేలో చేరేందుకు ఓపీఎస్ చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. దీంతో రాజకీయంగా నష్టపోవడం ఖాయమని భావించిన మనోజ్ పాండ్యన్.. డీఎంకే తీర్థం పుచ్చుకున్నారు. ఆ తరువాత ఆయన అసెంబ్లీకి వెళ్లి స్పీకర్ అప్పావుకు తన రాజీనామా లేఖను అందించారు. ప్రస్తుతం ఆయన డీఎంకేలో చేరటంతో ఓపీఎస్ వర్గంలోని శాసనసభ్యుల సంఖ్య ఒకటికి తగ్గింది. ఒరత్తనాడు శాసనసభ్యుడు ఆర్.వైద్యలింగం మాత్రమే ఓపీఎస్ అనుచరుడిగా ఉంటున్నారు.

పూర్తిస్థాయికి చేరువగా
చెంబరంబాక్కం



పెరంబూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరవాసులకు తాగునీరందించే జలాశయాల్లో ఒకటైన చెంబరంబాక్కం జలాశయం పూర్తిస్థాయికి చేరువైంది. రాష్ట్రంలో గత నెల 16వ తేది ప్రవేశించిన ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో కురిసిన వర్షాలకు జలాశయాలు, చెరువులు జలకళ సంతరించుకున్నాయి. అలాగే, నగరం, శివారు ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు చెన్నైకి తాగునీరందించే జలాశయాల్లో నీటిమట్టం పెరిగింది. చెంబరంబాక్కం జలాశయం పూర్తి సామర్థ్యం 25 అడుగులు కాగా, మంగళవారం ఉదయం నీటిమట్టం 22 అడుగులకు చేరుకుంది. జలాశయం నుంచి నగర తాగునీటి అవసరాలకు వంద మిలియన్ ఘనపుటడుగుల నీరు విడుదల చేస్తున్నారు. మరో రెండు నెలలు నగరం, శివారు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం హెచ్చరికలతో, చెంబరంబాక్కం జలాశయం నుంచి అదనపు జలాలు విడుదల చేసే విషయాన్ని జలవనరుల శాఖ అధికారులు పరిశీలిస్తున్నారు.

గుమ్మిడిపూండి నుంచి కన్నియాకుమారి వరకు...
రాష్ట్రవ్యాప్తంగా 'సర్' ప్రక్రియ ప్రారంభం


చెన్నైలో ఓ ఇంటి వద్ద ఓటర్ల జాబితా సవరణ దరఖాస్తు ఫారాన్ని అందజేస్తున్న ఎన్నికల సిబ్బంది

చెన్నై, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ ప్రారంభమైంది. ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో గుమ్మిడిపూండి నుంచి కన్నియాకుమారి వరకు ఉన్న 234 శాసనసభ నియోజకవర్గాలలో ఈ పనులు చురుకుగా సాగుతున్నాయి. ఎన్నికల సంఘం నియమించిన సిబ్బంది 2002లో తయారు చేసిన ఓటర్ల జాబితా నకళ్ళు పట్టుకుని ఇంటింటికీ వెళ్ళి ఓటర్ల జాబితాల్లో చేర్పులు, మార్పులకు అవసరమైన దరఖాస్తు ఫారాలను, కొత్త ఓటర్లను చేర్పించేందుకు ఫారమ్-6 అందజేస్తున్నారు. అదే విధంగా రాష్ట్రేతరులుంటే వారంతా ప్రమాణ పత్రాలను సమర్పించాలని ఎన్నికల సిబ్బంది ప్రజలకు సూచించారు. చిరునామా మారినవారు, ఇంతకు ముందు వేరే నియోజకవర్గంలో ఉన్నప్పటి జాబితాలో వారి పేర్లు లేకపోతే ఎన్నికల సంఘం ప్రకటించినట్లు ఆధార్ సహా 12 ధ్రువ పత్రాల్లో ఓటరు ఫొటో అతికించేందుకు తగిన స్థలం కేటాయించి ఉన్న దరఖాస్తు అందజే శారు. ఓటర్లు తమ కలర్‌ఫొటోను అతికించాలని విజ్ఞప్తి చేశారు. ఆన్‌లైన్ ద్వారాను అవసరమైన వివరాలతో దరఖాస్తులను సమర్పించవచ్చునని ఎన్నికల సంఘం సిబ్బంది తెలిపారు.. ఆయా దరఖాస్తులను హెచ్చ్‌టీటీపీఎస్ఐఆర్‌ఈసీఐ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని కూడా తెలిపారు. తామిచ్చిన దరఖాస్తులో వివరాలను పొందుపరచి భద్రపరచమని, మరో రోజు వచ్చి ఆ దరఖాస్తులను స్వీకరిస్తామని సిబ్బంది తెలిపారు. వచ్చే డిసెంబర్ నాలుగు వరకూ ఈ ప్రత్యేక సమగ్ర సవరణ పనులు కొనసాగుతాయని ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు.

టీవీకే సలహాదారుడిగా చంద్రశేఖర్ ?

- నేడు ప్రత్యేక సర్వసభ్యమండలి సమావేశం
- పనిచేయని జిల్లా నేతలకు ఉద్వాసన


తండ్రి చంద్రశేఖర్‌తో విజయ్

చెన్నై, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కరూర్ దుర్ఘటన తర్వాత మళ్ళీ రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించడానికి తమిళగ వెట్రి కళగం (టీవీకే) నేత విజయ్ సిద్ధమవుతున్నారు. మొదట సకాలంలో తడిసిన ధాన్యం కొనుగోళ్లపై దృష్టి సారించలేదంటూ డీఎంకే ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఆ తర్వాత శ్రీలంక నావికాదళం 35 మంది తమిళ జాలర్లను అరెస్టు చేయడంపై నిరసన వ్యక్తం చేస్తూ మరో ప్రకటన చేశారు. తాజాగా కోవైలో విద్యార్థినిపై జరిగిన సామూహిక అత్యాచారానికి డీఎంకే ప్రభుత్వ మెతకవైఖరే కారణమంటూ మంగళవారం ఉదయం ప్రకటన విడుదల చేశారు. ఇలా ప్రకటనలకే పరిమితమైన విజయ్ బుధవారం మహాబలిపురంలో జరుగనున్న టీవీకే ప్రత్యేక సర్వసభ్యమండలి సమావేశంలో వేదికపై డీఎంకే ప్రభుత్వంపై విమర్శల వర్షం కురిపించబోతున్నారు. ఈ సమావేశంలో ఇప్పటి వరకు సక్రమంగా పనిచేయని జిల్లా కార్యదర్శులకు ఉద్వాసన పలకనున్నారు. అదే సమయంలో పార్టీ పరోక్షంగా సాయపడుతున్న తన తండ్రి, ప్రముఖ సినీ దర్శకుడు ఎస్ఏ చంద్రశేఖర్‌కు కొత్త పదవి అప్పగించే అంశంపై కూడా కూడా విజయ్ దృష్టి సారించారు. ఇప్పటికే విజయ్ తాజాగా నియమించిన పార్టీ నిర్వాహకుల కమిటీలో చంద్రశేఖర్ మద్దతుదారులు ఆరుగురున్నారు. ప్రత్యేక సర్వసభ్య మండలి సమావేశంలో విజయ్ అధికారికంగా ఈ విషయంపై ప్రకటన చేస్తారని చెబుతున్నారు.

జ్యోతిష్కుల సలహా కోసం ...

ఇదిలా ఉండగా అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండగా మళ్ళీ రోడ్‌షోలు జరపాలని విజయ్ నిర్ణయించారు. మదురై మహనాడు ముందు రోజు ఇనుప స్తంభం జారి ఓ కారుపై పడటం, కరూర్ రోడ్‌షోలో తొక్కిసలాట చోటుచేసుకుని 41 మంది ప్రాణాలు కోల్పోవటం పార్టీకి అపశకునాలుగా, విజయ్ భావిస్తున్నారని తెలిసింది. త్వరలోనే ప్రముఖ జ్యోతిష్యులను కలిసి వారి సలహా తీసుకుని విజయ్ రోడ్‌షోలో పాల్గొంటారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

టెన్త్, ప్లస్ టూ పరీక్షల టైం టేబుల్ విడుదల


టైం టేబుల్ విడుదల చేస్తున్న మంత్రి అన్బిల్ మహేష్

పెరంబూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి టెన్త్, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షల టైం టేబుల్ విడుదలైంది. కోట్టూరుపురంలో మంగళవారం టైం టేబుల్‌ను పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ విడుదల చేశారు. అలాగే, ప్లస్ వన్ తరగతి అరియర్ పరీక్షల తేదీలను కూడా ప్రకటించారు.

ప్లస్ టూ పరీక్షలు...

ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు మార్చి 2న ప్రారంభమై 26వ తేది వరకు జరుగనున్నాయి. వాటి ఫలితాలు మే 8వ తేది విడుదల చేయనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.15 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. అలాగే, ప్రాక్టికల్స్ ఫిబ్రవరి 9 నుంచి 16వ తేది వరకు జరుగనున్నాయి.

టెన్త్ ...

టెన్త్ పబ్లిక్ పరీక్షలు మార్చి 11న ప్రారంభమై ఏప్రిల్ 6వ తేది వరకు జరుగనున్నాయి. వాటి ఫలితాలు మే 5న విడుదల చేయనున్నారు. ప్రాక్టికల్స్ ఫిబ్రవరి 23 నుంచి 28వ తేది వరకు జరుగనున్నాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.15 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. ఇక, ప్లస్ వన్ అరియర్ పరీక్షలు మార్చి 3 నుంచి 27వ తేది వరకు జరుగనున్నాయి. వాటి ఫలితాలు మే 20వ తేది విడుదల చేయనున్నారు. ఇక, ప్రాక్టికల్స్ ఫిబ్రవరి 16 నుంచి 21వ తేది వరకు జరుగనున్నాయి.

టెన్త్ టైం టేబుల్

11.03.2026:	తమిళం, ఇతర భాషలు
16.03.2026:	ఇంగ్లీషు
25.03.2026:	గణితం
30.03.2026:	సైన్స్
02.04.2026:	సామాజిక శాస్త్రం
06.04.2026:	ఐచ్ఛిక పాఠ్యాంశం

తొలిసారిగా కాలిక్యులేటర్ అనుమతి: మంత్రి

పరీక్షల టైం టేబుల్ విడుదల చేసిన అనంతరం మంత్రి అన్బిల్ మహేష్ మీడియాతో మాట్లాడుతూ... ఎన్నికల కమిషన్‌తో చర్చించిన అనంతరం టెన్త్, ప్లస్ టూ తరగతుల పబ్లిక్ పరీక్షల తేదీలు ప్రకటించామన్నారు. తొలిసారిగా 12వ తరగతి అకౌంటెన్సీ పరీక్షకు మాత్రమే కాలిక్యులేటర్‌కు అనుమతించనున్నామని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి భయాందోళన లేకుండా, ఉత్సాహంగా పబ్లిక్ పరీక్షలు రాయాలన్నారు. ఒక్కో పరీక్షకు 3 నుంచి 5 రోజుల వరకు సెలవులు ఉన్నట్లు మంత్రి తెలిపారు.

ప్లస్ టూ టైంటేబుల్

02.03.2026:	తమిళం, ఇతర భాషా పాఠ్యాంశం
05.03.2026:	ఇంగ్లీషు
09.03.2026:	కెమిస్ట్రీ, అకౌంటింగ్, జాగ్రఫీ
13.03.2026:	ఫిజిక్స్, ఎకనామిక్స్, ఎంప్లాయ్‌మెంట్ స్కిల్స్
17.03.2026:	మ్యాథ్స్, జువాలజీ, కామర్స్, మైక్రోబయాలజీ, న్యూట్రీషన్ అండ్ డైటెటిక్స్, టెక్స్‌టైల్స్ అండ్ డ్రెస్ డిజైనింగ్, ఫుడ్ సర్వీస్ మేనేజ్‌మెంట్, నర్సింగ్.
23.03.2026:	బయాలజీ, బోటనీ, హిస్టరీ, బిజినెస్ మేనేజ్‌మెంట్ అండ్ స్టాటిస్టిక్స్, బేసిక్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, బేసిక్ సివిల్ ఇంజనీరింగ్, బేసిక్ ఆటోమొబైల్ ఇంజనీరింగ్, బేసిక్ మెకానికల్ ఇంజనీరింగ్, టెక్స్‌టైల్ టెక్నాలజీ, ఆఫీస్ మేనేజ్‌మెంట్ అండ్ సెక్రటేరియల్
26.03.2026:	ఇంగ్లీషు, ఎథిక్స్ అండ్ ఇండియన్ కల్చర్, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, బయోకెమిస్ట్రీ, అడ్వాన్స్‌డ్ లాంగ్వేజ్ (తమిళ్), హోమ్ సైన్స్, పొలిటికల్ సైన్స్, స్టాటిస్టిక్స్, నర్సింగ్ (ఒకేషనల్), బేసిక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్

సమాచార దృష్టి

తగినంతమంది ప్రయాణికుల్లేక 12 విమానాల రద్దు

అడయార్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తగినంతమంది ప్రయాణికులు లేక 12 విమాన సేవలు రద్దయ్యాయి. నగరం నుంచి ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, అహ్మదాబాద్, పూనే, ఘజియాబాద్ నగరాలకు వెళ్లాల్సిన 6 విమానాలు, ఆ నగరాల నుంచి రావలసిన 6 విమానాలు రద్దయ్యాయి. ఈ విమానాలకు రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. వారిని మరో విమానాల్లో పంపించేలా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. కాగా, తగినంత మంది ప్రయాణికులు లేకపోవడంతో విమానాలు రద్దు చేసినట్లు సమాచారం.

'క్లాట్' దరఖాస్తు గడువు పొడిగింపు

అడయార్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల్లో చేరేందుకు 'క్లాట్' ప్రవేశ పరీక్ష దరఖాస్తు స్వీకరణ ఈ నెల 7వ తేది వరకు పొడిగించారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని 25 జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల్లో యూజీ, పీజీ కోర్సుల్లో చేరేందుకు 'క్లాట్' ఉత్తీర్ణత కావాల్సి ఉంది. అలాగే, పలు ఉన్నత విద్యాసంస్థలు క్లాట్ మార్కుల ఆధారంగా విద్యార్థులకు అడ్మిషన్లు కల్పిస్తున్నాయి. 2026-27 విద్యా సంవత్సరంలో విద్యార్థుల అడ్మిషన్లకు డిసెంబరు 7వ తేది మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు క్లాట్ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు దరఖాస్తు స్వీకరణ ఆగస్టు 1న ప్రారంభమై అక్టోబరు 31వ తేదీతో ముగిసింది. విద్యార్థుల విజ్ఞప్తి మేరకు దరఖాస్తు సమర్పణ గడువు ఈ నెల 7వ తేది వరకు పొడిగించారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునే జనరల్ విభాగానికి చెందిన వారు రూ.4,000, ఎస్సీ, ఎస్టీ విభాగాలకు చెందిన వారు రూ.3,500 ఫీజు చెల్లించాల్సి ఉంది.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అడయార్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువొత్తియూర్‌లోని ప్రభుత్వ ఐటీఐలో చేరేందుకు విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ విడుదల చేసిన ప్రకటనలో... తిరువొత్తియూర్‌లోని ప్రభుత్వ ఐటీఐలో వృత్తి శిక్షణ కోర్సులు అందిస్తున్నారని తెలిపారు. ఎలాంటి ఫీజు వసూలుచేయడం లేదని, స్కాలర్‌షిప్‌గా రూ.750, అర్హులైన విద్యార్థినులకు 'పుదుమై పెన్', విద్యార్థులకు 'తమిళ్ ముదల్వన్' పథకంలో ప్రతినెలా రూ.1000, యూనిఫాం, బస్‌పాస్ తదితరాలు అందిస్తామన్నారు. ఐటీఐలో చేరేందుకు ఆసక్తి ఉన్న వారు ఈ నెల 14వ తేదిలోగా నేరుగా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9566891187, 9940372875, 8946017811 అనే నెంబర్లు సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.

'టెట్' హాల్ టిక్కెట్ల విడుదల

పెరంబూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) హాల్ టిక్కెట్లను ఉపాధ్యాయ ఎంపిక బోర్డు (టీఆర్బీ) విడుదల చేసింది. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మంగళవారం నుంచి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. టెట్ పరీక్ష నోటిఫికేషన్ ఆగస్టు 11న విడుదల చేశారు. ఆ ప్రకారం, ఈ నెల 15వ తేది మొదటి పేపరు, 16వ తేది రెండో పేపరు పరీక్ష జరుగనుంది. ఈ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు టీఆర్బీ వెబ్‌సైట్‌లో యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ వినియోగించి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్ డౌన్ లోడ్ చేసుకోలేని అభ్యర్థుల సౌకర్యార్థం ఈ నెల 4 నుంచి 10వ తేది వరకు (పని రోజులు) 'టీఎన్‌టెట్-2025' పేరుతో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు టీఆర్బీ తెలియజేసింది.

సెమిస్టర్ ఫలితాలు విడుదలైన 15 రోజుల్లో సప్లిమెంటరీ

అడయార్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయం క్యాంపస్ కాలేజీల్లో సెమిస్టర్ ఫలితాలు ప్రకటించిన 15 రోజుల్లోగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు అన్నా వర్సిటీ విడుదల చేసిన ప్రకటనలో... అన్నా వర్సిటీ క్యాంపస్‌లో గిండి ఇంజనీరింగ్ కళాశాల, అళగప్ప టెక్నికల్ కళాశాల, చెన్నై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ కళాశాలలున్నాయి. ఈ కళాశాలల్లో ఈ నెలలో ప్రారంభం కానున్న సెమిస్టర్ పరీక్షలు డిసెంబరుతో పూర్తవుతాయి. డిసెంబరు నెలాఖరులో పరీక్షా ఫలితాలు వెల్లడించనున్నారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని విద్యార్థులు మళ్లీ పరీక్షలకు ఆరు నెలలు వేచి ఉండాల్సి ఉంటోంది. విద్యార్థుల అభ్యర్థన మేరకు, సెమిస్టర్ ఫలితాలు విడుదలైన 15 రోజుల్లోగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. ఆ ప్రకారం, వచ్చే ఏడాది జనవరి రెండవ వారంలో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించి, సత్వరం ఫలితాలు విడుదల చేయనున్నట్లు అన్నా వర్సిటీ తెలిపింది.

ప్రభుత్వ బస్సుల్లో పొంగల్ రిజర్వేషన్ ప్రారంభం

అడయార్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో పొంగల్ పండుగ ముందస్తు టిక్కెట్ రిజర్వేషన్ ప్రారంభమైంది. ఈ మేరకు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) అధికారులు మాట్లాడుతూ... ప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో 90 రోజుల ముందుగా రిజర్వేషన్ చేసుకునే సదుపాయం ఉందన్నారు. 2026 జనవరి 14వ తేది పొంగల్ పండుగ ప్రజలు జరుపుకోనున్నారని తెలిపారు. ప్రభుత్వ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్లు అధికంగా ఉంటే, ప్రత్యేక బస్సులు నడుపుతామని తెలిపారు. www. tnstc.in అనే వెబ్‌సైట్, అదే యాప్ ద్వారా రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

మేట్టూరు డ్యాం నుంచి సాగుజలాల విడుదల పెంపు

పెరంబూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మేట్టూరు డ్యాం నుంచి డెల్టాకు విడుదల చేస్తున్న సాగునీరు పెంచారు. జలాశయం నుంచి 10వేల ఘనపుటడుగులుగా విడుదల చేస్తున్న నీటిని, మంగళవారం నుంచి 18,500 ఘనపుటడుగులకు పెంచారు. కావేరి నది పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో, సోమవారం డ్యాంలోకి 7,032 ఘనపుటడుగులుగా వస్తున్న నీరు, మంగళవారం 6,083 ఘనపుటడుగులకు తగ్గింది. ప్రస్తుతం డ్యాంలో 118.99 అడుగుల నీటిమట్టాలు ఉన్నాయని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

గ్యాంగ్‌రేప్‌లో పట్టుబడిన వారు నిందితులేనా?

● కోవై మహాధర్నాలో మాజీమంత్రి వలర్మతి


ధర్నాలో నినాదాలు చేస్తున్న అన్నాడీఎంకే కార్యకర్తలు

ప్యారీస్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోవైలో విద్యార్థినిపై జరిగిన గ్యాంగ్‌రేప్ కేసులో పట్టుబడిన ముగ్గురు నిందితులేనా అని అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి వలర్మతి ప్రశ్నించారు. కోవై పీలమేడు విమానాశ్రయం సమీపంలో ఆదివారం అర్ధరాత్రి ఓ కళాశాల విద్యార్థినిపై గంజాయి ముఠాకు చెందిన ముగ్గురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. దీనిని రాజకీయ పార్టీలు తీవ్రంగా ఖండించాయి. ఈ నేపథ్యంలో, మహిళలకు భద్రత పటిష్ఠం చేయాలని కోరుతూ అన్నాడీఎంకే మహిళా విభాగం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ప్రకటించారు. ఆ మేరకు కోవై రెడ్‌క్రాస్ సమీపంలో మంగళవారం ఉదయం మాజీమంత్రి పి.వలర్మతి అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో మహిళా కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వారు డీఎంకే ప్రభుత్వం, కోవై నగర పోలీసుల వైఖరికి నిరసనగా నినాదాలు చేశారు. ధర్నాలో వలర్మతి మాట్లాడుతూ, డీఎంకే అధికారంలో ఉన్న ఈ నాలుగున్నరేళ్లలో దాదాపు 4,150 మంది లైంగిక, అత్యాచార వేధింపులకు గురయ్యారని, వీరికి పాలకులు ఏ విధమైన న్యాయం చేయలేదని మండిపడ్డారు. కళాశాల విద్యార్థినిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు కోవై పోలీసులు చెబుతున్నారని, అయితే వారిలో ఒక్కరిని కూడా మీడియాకు చూపించకపోవడం వల్ల వాళ్లు అసలు నిందితులేనా? అని అనుమానించాల్సి వస్తుందన్నారు. మాజీముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలిత, ఎడప్పాడి పాలనలో తమ బాధ్యతను సక్రమంగా నెరవేర్చిన పోలీసులు ప్రస్తుతం అన్నాడీఎంకే అధికారంలో లేనందువల్లే రాష్ట్రంలో సంఘ విద్రోహుల సంఖ్య పెరిగిందని, మద్యం, గంజాయి మత్తుకు బానిసలైనవారిని అదుపుచేయడంలో పోలీసుశాఖ విఫలమైందని ఆమె వ్యాఖ్యానించారు.

ఆరుగురిని వివాహమాడిన భార్యపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్యారీస్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆరుగురిని వివాహం చేసుకుని మోసం చేసిన మహిళపై కలెక్టర్ కార్యాలయంలో భర్త ఫిర్యాదు చేశాడు. కళ్లకురిచ్చి జిల్లా శంకరాపురం సమీపంలో మూరార్‌పాళయంకు చెందిన శివకుమార్ అనే లారీ డ్రైవర్ సోమవారం ఉదయం తన ఇద్దరు పిల్లలను తీసుకుని కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి తన భార్యపై ఫిర్యాదు చేశాడు. అందులో మదురై జిల్లా కళ్లుపట్టికి చెందిన మహిళతో 2019లో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఏర్పడిన పరిచయం ప్రేమగా మారిందని, 2020లో వివాహం చేసుకున్న తమకు ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిపారు. కొన్ని నెలల క్రితం ఆంధ్రరాష్ట్రంలో ఉన్న తన బామ్మ ఇంటికి పిల్లలతో వెళ్లిన తన భార్య నెలలు గడిచినా.. ఇంటికి తిరిగి రాలేదని, తాను అక్కడికి వెళ్లి బామ్మ ఇంట్లో ఉన్న పిల్లలను తనతో తీసుకొచ్చానని, తన భార్య ఆచూకీ తెలుసుకోవల్సిందిగా శంకరాపురం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి పోలీసులు జరిపిన విచారణలో శివకుమార్ భార్య 2013లో వెంకటేశన్ అనే వ్యక్తిని ప్రేమ వివాహం చేసుకుందని, 2016లో కోవైకు చెందిన సురేష్‌కుమార్‌ను వివాహం చేసుకుని అతడి నుండి విడిపోయి సెల్వరాజ్ అనే వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకున్న విషయం వెలుగుచూసింది. 2019లో మదురైకు చెందిన లింగుస్వామిని ప్రేమించి పెళ్లిచేసుకుని గర్భం దాల్చిందని, ఆ సమయంలో ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెతో ఏర్పడిన పరిచయం వివాహం వరకు దారితీసిందని తెలిపారు. ఈ రకంగా తన ఇంటినుండి రూ.3లక్షల నగదు, మూడున్నర సవర్ల నగలతో వెళ్లిన తన భార్య ప్రస్తుతం అంబూరుకు చెందిన మణికంఠన్‌ను ఆరో వివాహం చేసుకున్నట్లు తెలిసిందని, అందువల్ల ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ కార్యాలయంలో ఈ ఫిర్యాదు పరిశీలించిన అధికారులకు విచారణ జరపాల్సిందిగా పోలీసులకు సిఫారసు చేశారు.

ఒక్క విద్యార్థి కూడా లేని పాఠశాలలు 311

● సర్వేలో వెల్లడి

ప్యారీస్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఒక్క విద్యార్థి కూడా లేకుండా 311 ప్రభుత్వ పాఠశాలలున్నట్లు తాజా సర్వేలో తేలింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పాఠశాలల్లో అడ్మిషన్, ప్రాంగణాల్లో కనీస వసతులు మెరుగుపరచడం, నాణ్యమైన విద్యాబోధన తదితర అంశాలపై సమాచార పరిశోధన విభాగం అధికారులు ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా సర్వే నిర్వహించి నివేదిక విడుదల చేశారు. ఆ ప్రకారం రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో 2024-25వ విద్యాసంవత్సరంలో 1వ తరగతిలో చేరిన విద్యార్థుల సంఖ్య ఘననీయంగా తగ్గింది. ప్రైవేటు పాఠశాలల్లో ఈ ఏడాది సుమారు 2లక్షల పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. 2020-2021లో ప్రభుత్వ, ప్రభుత్వ రాయితీ పొందుతున్న ఎయిడెడ్ పాఠశాలల్లో సుమారు 4.15 లక్షల మంది విద్యార్థులు చేరిన నేపథ్యంలో, ఈ విద్యాసంవత్సరంలో ఆ సంఖ్య 3.60 లక్షలకు తగ్గింది. అదేవిధంగా ఈ విద్యాసంవత్సరంలో 208 ప్రభుత్వ పాఠశాలలు, 1,204 ఎయిడెడ్ పాఠశాలల్లో కొత్త విద్యార్థులను చేర్చుకోలేదు. అదే సమయంలో ఒక్క విద్యార్థి కూడా లేకుండా 311 ప్రభుత్వ పాఠశాలలు కేవలం ఉపాధ్యాయులతో మాత్రమే పనిచేయడం గమనార్హం. ఇదిలా ఉండగా, ప్రభుత్వ ప్రాథమిక విద్యాశాఖ పరిధిలోని పాఠశాలలు ఈ పరిస్థితికి దిగజారడంపై పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, తమిళ మానిల కాంగ్రెస్ అధ్యక్షుడు జీకే వాసన్ తదితర రాజకీయ నేతలు ఆందోళన వ్యక్తంచేశారు.

హైకోర్టుకు ధోని వస్తే సమస్యలు

అడయార్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజాభిమానం ఎక్కువగా ఉన్న ధోని హైకోర్టుకు వస్తే విచారణకు సమస్య వస్తుందని హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. ఐపీఎల్ బెట్టింగ్ కేసుకు సంబంధించిన టెలివిజన్ చర్చలో తన పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేశారంటూ ఐపీఎస్ అధికారి సంపత్ కుమార్, జీ మీడియా కార్పొరేషన్, న్యూస్ నేషన్ నెట్‌వర్క్ అనే హిందీ న్యూస్ ఛానల్‌పై క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోని 2014లో మద్రాసు హైకోర్టులో రూ.100 కోట్ల పరువు నష్టం కేసు దాఖలుచేశారు. ఈ కేసులో ధోని వాంగ్మూలం నమోదుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమించాలని మద్రాసు హైకోర్టు ఆదేశించింది. ఈ ఉత్తర్వులు వ్యతిరేకిస్తూ సంపత్ కుమార్ అప్పీలు పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను న్యాయమూర్తులు జస్టిస్ ఎస్ఎం సుబ్రమణ్యం, మహ్మద్ షఫీక్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఆ సమయంలో సంపత్‌కుమార్ తరఫున హాజరైన న్యాయవాది... ఈ కేసులో ధోని తన వాంగ్మూలం నమోదుచేసేందుకు కోర్టు హాజరుకావాలని ఆదేశించాలంటూ అభ్యర్థించారు. వివిధ రంగాల ప్రముఖులు తమ వాంగ్మూలం నమోదు చేయడానికి కోర్టుకు వస్తుండగా, ధోని ఒక్కడికే సమస్య ఏమిటి? అంటూ ప్రశ్నించారు. ఈ కేసులో మొదటి నుంచి ధోని చట్టాన్ని పాటించడం లేదని ఆరోపించారు. ఈ వాదన నిరాకరించిన ధర్మాసనం, ధోని జాతీయ స్థాయి సెలబ్రిటీ క్రికెటర్ అని, అతడు న్యాయస్థానానికి వస్తే కోర్టు కార్యకలాపాలకు ఆటంకం ఏర్పడుతుందని, అతడి కోసం వివిధ ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని తెలిపింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ద్వారా తన వాంగ్మూలం నమోదుచేసేటప్పుడు సంపత్ కుమార్ లేదా ఆయన తరఫు న్యాయవాది హాజరవుతారని తెలిపారు. అందువల్ల పబ్లిక్ ప్రాసిక్యూటర్ నియామకంలో ఎలాంటి తప్పు జరగలేదని పేర్కొన్న ధర్మాసనం, అప్పీలు పిటిషన్ కొట్టివేసింది.

నీటి తొట్టెలో దూకి తండ్రి,కుమార్తె ఆత్మహత్య


మయిల్ కన్నన్, ప్రీతి కన్నన్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నామక్కల్‌లో నివసిస్తున్న తండ్రీ, కుమార్తె నీటి తొట్టెలో పడి ఆత్మహత్య చేసుకున్నారు. నామక్కల్ కొసవంబట్టి యోగానగర్‌లో మయిల్ కన్నన్ (68), కస్తూరి (54) అనే దంపతులు నివసిస్తున్నారు. వీరికి ప్రదీప్ కన్నన్ (37) అనే కుమారుడు, ప్రీతి కన్నన్ (34) అనే కుమార్తె ఉన్నారు. కస్తూరి పదేళ్ల క్రితం భర్తతో గొడవపడి పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు. కుమారుడు ప్రదీప్ కన్నన్ ఉద్యోగం కోసం అమెరికా వెళ్లి అక్కడే ఓ యువతిని పెళ్లి చేసుకుని స్థిరపడిపోయాడు. ఈ పరిస్థితుల్లో మయిల్ కన్నన్, కుమార్తె ప్రీతి కన్నన్ మాత్రమే మిగిలారు. ఇద్దరూ మధుమేహంతో బాధపడుతున్నారు. ప్రీతికి పెళ్లీడు దాటిపోవడంతో ఆయన తీవ్ర మనో వేదనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి ఇరువురూ ఇంటిలోనే ఉన్న పెద్ద నీటితొట్టెలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. మంగళవారం ఉదయం ఆ ఇంటి లోపల నుండి అలికిడి వినిపించకపోవడంతో చుట్టుపక్కలివారు అనుమానంతో వెతగగా, ఇరువరూ నీటి తొట్టెలో శవాలుగా తేలుతుండటం గమనించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. నామక్కల్ నగర పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ఇరువురి మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు. పోలీసులు ఆ ఇంటిలో పరిశీలించగా మయిల్ కన్నన్ రాసి ఉంచిన లేఖ లభించింది. ఆ లేఖలో తమ ఇద్దరికి మృతికి మధుమేహం వలన ఏర్పడుతున్న బాధలే కారణమని, అప్పులు బాధలు తదితర సమస్యలేవీ లేవని మయిల్ కన్నన్ రాసి ఉంచినట్లు పోలీసులు తెలిపారు.

ఒకేరోజు 84.37 మెట్రిక్ టన్నుల వ్యర్థాల సేకరణ


పాత సామాన్లు సేకరిస్తున్న పారిశుధ్య కార్మికులు

పెరంబూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 1వ తేదీ (శనివారం) 84.37 మెట్రిక్ టన్నుల పాత వ్యర్థాలు సేకరించారు. ఈ మేరకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి.. నగరంలోని అన్ని ఇళ్ల దగ్గరకు పారిశుధ్య కార్మికులు వెళ్లి ప్రతిరోజూ సుమారు 6,500 మెట్రిక్ టన్నుల పొడి, తడి చెత్త, వెయ్యి మెట్రిక్ టన్నుల భవన నిర్మాణ వ్యర్థాలు సేకరిస్తున్నారు. పారిశుధ్య కార్మికులు ఇళ్ల నుంచి చెత్త మాత్రమే సేకరిస్తున్నారు. కానీ, పలు ఇళ్ల యజమానులు తమ ఇళ్లలోని పాత దుస్తులు, గృహోపకరణాలు బహిరంగ ప్రాంతాల్లో పారవేస్తుండంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఈ సమస్య పరిష్కరించేలా ప్రతి శనివారం ఇళ్ల వద్దకే వెళ్లి పాత చెక్కలు, సోఫాలు సేకరించాలని జీసీసీ నిర్ణయించింది. ఈ మేరకు గత నెల 11వ తేదీ ఈ ప్రక్రియ ప్రారంభించారు. ఆ ప్రకారం అక్టోబరు 11,18,25 తదితర శనివారాల్లో 447 మంది నుంచి 141.39 మెట్రిక్ టన్నుల పాత సామాన్లు సేకరించారు. ఆ ప్రకారం, ఈ నెల 1వ తేది 137 మంది నుంచి 84.37 మెట్రిక్ టన్నుల పాత సామానులు సేకరించి, కొడుంగైయూర్‌లోని కర్మాగారానికి తీసుకెళ్లి దహనం చేశారు. ప్రతి శనివారం పాత సామాన్ల సేకరణ జరుగుతుందని, ఇళ్ల యజమానులు 'నమ్మ చెన్నై' యాప్ ద్వారా, 1913 అనే నెంబరు, 9445061913 అనే వాట్సాప్ నెంబరుకు తమ వివరాలు తెలియజేస్తే, పారిశుధ్య కార్మికులు వారి ఇంటికే వెళ్లి పాత సామానులు సేకరిస్తారని జీసీసీ తెలిపింది.

మహిళ స్నానం చిత్రీకరణ.. యువకుడికి మూడేళ్ల జైలు

అడయార్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహిళ స్నానం చేస్తున్న దృశ్యాలు చిత్రీకరించిన యువకుడిని కోర్టు మూడేళ్ల జైలుశిక్ష విధించింది. స్థానిక మనలి ప్రాంతానికి చెందిన 23 ఏళ్ల మహిళ 2021లో తన ఇంట్లో స్నానం చేస్తుండగా అదే ప్రాంతానికి చెందిన మోనీష్ గౌతమ్ కిటికీ నుంచి సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడు. గమనించిన మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. తిరువొత్తియూర్ క్రిమినల్ కోర్టు మోనీష్ గౌతమ్‌కు మూడేళ్ల జైలుశిక్ష, రూ.1,000 జరిమానా విధించింది.

పట్టా కత్తితో కేక్ కటింగ్

● ఐదుగురి అరెస్ట్

అడయార్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లాలో పట్టా కత్తితో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకొని, ఆ దృశ్యాలు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. కొప్పూర్ గ్రామానికి చెందిన తమిళ్‌వాళి (23) ఈ నెల 1వ తేది తన జన్మదినాన్ని స్నేహితులు అరుణ్‌కుమార్, కనీష్కర్, 17 ఏళ్ల బాలుడి సహా ఐదుగురి మధ్య జరుపుకున్నాడు. తమిళ్‌వాళి పొడవైన కత్తితో కేక్ కట్ చేసి స్నేహితులకు పంచాడు. ఆ సమయంలో టపాసులు కాల్చిన స్నేహితులు, కొన్ని టపాసులను సమీపంలోని ఇళ్లపై విసిరారు. ఆ సమయంలో అందరూ మద్యం సేవించినట్లు సమాచారం. ఈ దృశ్యాలు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి, ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. అవి వైరల్ కావడంతో, మనవాళనగర్ పోలీసులు కేసు నమోదుచేసి తమిళ్‌వాళి సహా ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారిలో ఇద్దరు మైనర్లు కావడంతో హెచ్చరించిన పోలీసులు, స్టేషన్ బెయిలుపై విడుదల చేసి, మిగిలిన ముగ్గురిని పుళల్ జైలుకు తరలించారు.

రాందాస్, అన్బుమణి వర్గాల బాహాబాహీ

● ఎమ్మెల్యే కారు ధ్వంసం


పరస్పరదాడులకు పాల్పడుతున్న ఇరువర్గాలు

పెరంబూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా వాలప్పాడి సమీపంలో పీఎంకే నాయకులు రాందాస్, అన్బుమణి వర్గాలు బాహాబాహీకి దిగాయి. ఆ పార్టీ ఎమ్మెల్యే కారుపై దాడిచేయడం ఉద్రిక్తతకు దారితీసింది. సేలం పశ్చిమ నియోజకవర్గ కార్యదర్శి, ఎమ్మెల్యే అరుళ్ పీఎంకే నేత రాందాస్‌కు నమ్మినబంటు. ఆయనకు అన్బుమణి మద్దతుదారులకు మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. అదే సమయంలో అరుళ్‌కు అన్బుమణి మద్దతుదారులు ఫోన్‌లో హత్యా బెదిరింపులు చేశారని సమాచారం. ఈ విషయమై అరుళ్, తనకు ప్రాణహాని ఉందని, తగిన భద్రత కల్పించాలంటూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పీఎంకే ఎమ్మెల్యే అరుళ్ తన మద్దతుదారులతో కలిసి మంగళవారం వాలప్పాడిలోని పార్టీ నేత ఇంటిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని తిరుగు ప్రయాణమయ్యారు. ఆ సమయంలో, అన్బుమణి మద్దతుదారులు ఎమ్మెల్యే కారుపై రాళ్లు రువ్వుతూ దాడికి దిగారు. అంతలో రాందాస్ మద్దతుదారులు కూడా ప్రత్యర్థులపై రాళ్లతో దాడిచేశారు. ఇరువర్గాలు కర్రలతో పరస్పరదాడులకు పాల్పడడంతో ఆ ప్రాంతం రణరంగంగా మారింది. ఈ ఘటనలో ఓ కారు ధ్వంసం కాగా అందులో ఉన్న ఎమ్మెల్యేకు అనుచరులు రక్షణగా నిలిచారు. పోలీసులు అక్కడకు చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితి అదుపులోకి తెచ్చారు. ఇప్పటివరకు పరస్పర ఆరోపణలకు పాల్పడుతున్న రాందాస్, అన్బుమణి వర్గీయులు బాహాబాహీకి దిగడం ఆ పార్టీ కార్యకర్తలను ఆందోళనల గురిచేసింది.

'సర్' కారణంగా పౌరసత్వం కోల్పోయే ప్రమాదం

● సీపీఎం నేత బాలకృష్ణన్

అడయార్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) చేపట్టేందుకు, కేంద్ర ఎన్నికల సంఘం తక్కువ కాలం నిర్ణయించిందని, దీంతో పలువురు పౌరసత్వం కోల్పోయే ప్రమాదముందని సీపీఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్ ఆందోళన వ్యక్తం చేశారు. తంజావూరులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో 6.18 కోట్ల మంది ఓటర్లు ఉండగా, ఒకే నెలలో 'సర్' చేపట్టడం సాధ్యం కాదన్నారు. ఈ కారణంగా 20 నుంచి 30 శాతం మంది ఓటు హక్కు కోల్పోయే పరిస్థితి నెలకొందన్నారు. సర్‌కు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో అన్ని జిల్లాల్లో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో, ఈడీ ద్వారా మంత్రులపై కేసులు నమోదుచేసి, తద్వారా రాజకీయ లబ్ధి పొందాలని బీజేపీ ప్రయత్నాలు చేపట్టిందని బాలకృష్ణన్ ఆరోపించారు.

వార్ రూమ్ ద్వారా 'సర్' పరిశీలన

● టీఎన్‌సీసీ నేత సెల్వపెరుంతగై


వేదికపై టీఎన్‌సీసీ నేతలు, నిర్వాహకులు

ప్యారీస్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రారంభించిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పనులను పరిశీలించేందుకు జిల్లాలవారీగా 'వార్ రూమ్'లను ఏర్పాటు చేసినట్లు తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ)అధ్యక్షుడు సెల్వపెరుంతగై పేర్కొన్నారు. రాయపేటలోని టీఎన్‌సీసీ కార్యాలయం సత్యమూర్తి భవనంలో ఏర్పాటు చేసిన వార్ రూంను మంగళవారం ప్రారంభించిన ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ నుండి 2003వ సంవత్సరం ఎస్ఐఆర్ తొలగించిన విషయాన్ని లోక్‌సభ ప్రతిపక్షనేత, తమ నాయకుడు రాహుల్‌గాంధీ ప్రజలకు తెలియజేశారని, ఇదే అంశాన్ని రాష్ట్రముఖ్యమంత్రి స్టాలిన్ సహా డీఎంకే మిత్రపక్షాలు కూడా ప్రస్తావించాయని, ఎస్ఐఆర్ వ్యవహారంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్ఐఆర్ పనులను రాష్ట్రవ్యాప్తంగా పార్టీ తరుపు ఏర్పాటు చేసిన వార్ రూమ్‌ల ద్వారా పర్యవేక్షించేందుకు పార్టీ జిల్లా అధ్యక్షులకు బాధ్యతలు అప్పజెప్పినట్లు ఆయన తెలిపారు.

'సర్'పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

● ఎన్నికల అధికారులకు కలెక్టర్ సూచన


మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతాప్

తిరుత్తణి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలని ఎన్నికల అధికారులకు తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ ప్రతాప్ సూచించారు. మంగళవారం ఉదయం సర్ నిర్వహణ పనులపై ఆ జిల్లా ఎన్నికల అధికారులకు కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, తిరువళ్లూరు జిల్లావ్యాప్తంగా 10 నియోజకవర్గాల్లో 32.82లక్షల మంది ఓటర్లున్నారని, అత్యధికంగా మాధవరంలో 4లక్షల ఓటర్లు, పొన్నేరిలో అత్యల్పంగా 2లక్షల ఓటర్లు ఉన్నారన్నారు. ప్రతి బీఎల్‌వోలు ఎస్ఐఆర్ పరిశీలనలో పూర్తిస్థాయి వివరాలు ఇంటింటికీ వెళ్లి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, అదేవిధంగా 18యేళ్లు దాటికి యువకులకు కొత్త ఓటు నమోదు చేయాలని పిలుపునిచ్చారు. ఆర్కే పేట, పెళ్లత్తూరు, వంగనూర్, శ్రీకాళికాపురం, చందనవేణుగోపాలపురం, రంగనాయుడుకుప్పం, జనకరాజకుప్పం, సెల్లత్తూరు, తిరుత్తణి, పళ్లిపట్టు సహా పలు ప్రాంతాలకు చెందిన ఎన్నికల నిర్వాహణ అధికారులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

క్రీడాశాఖ ఆధ్వర్యంలో మారథాన్


జెండా ఊపి మారథాన్ ప్రారంభిస్తున్న మంత్రి నాజర్ తదితరులు

తిరుత్తణి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అన్నాదురై జయంతోత్సవాల్లో భాగంగా రాష్ట్ర క్రీడాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం మారథాన్ కార్యక్రమం జరిగింది. తిరువళ్లూరులోని ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మైనారిటీశాఖ మంత్రి నాజర్ హాజరై పచ్చజెండా ఊపి పోటీని ప్రారంభించారు. మారథాన్ విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. ఎమ్మెల్యే చంద్రన్, కలెక్టర్ ప్రతాప్, డీఎంకే నిర్వాహకులు పాల్గొన్నారు.

మద్యం తరలించిన ఇద్దరి అరెస్ట్

తిరుత్తణి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై మద్యం సీసాలను తరలిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతాల నుండి తక్కువ ధరకు విక్రయిస్తున్న మద్యం కొనుగోలు చేసి తిరువళ్లూరు జిల్లాలోని పలు మద్యం దుకాణాల్లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు పోలీసులకు అందిన సమాచారం మేరకు షోళింగర్, తిరువలంగాడు తదితర ప్రాంతాల్లో తనిఖీలను ముమ్మరం చేశారు. సోమవారం రాత్రి తిరుపతి జాతీయ రహదారిలో వస్తున్న బైక్‌ను ఆపి తనిఖీ చేయగా, వారివద్ద ఆంధ్రా మద్యం గుర్తించి స్వాధీనం చేసుకుని, ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు షోళింగర్‌కు చెందిన దక్షిణామూర్తి, ప్రవీణ్‌కుమార్‌లుగా గుర్తించారు. కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు.. 32,985 మందిపై క్రిమినల్ కేసులు

పెరంబూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాస్‌పోర్ట్ కోరుతూ దరఖాస్తు చేసుకున్న 79.40 లక్షల మంది వివరాలు పోలీసులు విచారించగా, వారిలో 32,985 మందిపై క్రిమినల్ కేసులున్నట్లు తెలిసింది. పాస్ పోర్ట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారిళ్లకు వెళ్లే ఇంటెలిజెన్స్ అధికారులు, వారిచ్చిన వివరాలు ధ్రువీకరించుకుని, తమ నివేదికలను అధికారులకు అందజేస్తుంటారు. గత ఏడాది జూలై వరకు, రాష్ట్రవ్యాప్తంగా పాస్ పోర్ట్ కోరుతూ దరఖాస్తు చేసుకున్న 79.40 లక్షల మందిని పోలీసులు విచారణ చేసిన సమయంలో, 32,985 మందిపై క్రిమినల్ కేసులున్నట్లు తెలిసింది. ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ... డ్రగ్స్ స్మగ్లర్లు వివిధ వ్యూహాలు ఉపయోగించి పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారని, వాటిని అడ్డుకొనేలా వారు చేస్తున్న ప్రయత్నాలను మేము నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

ఎం-యూటీఎస్ ద్వారా అన్‌రిజర్వుడు టిక్కెట్లు

● సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో పరిచయం

పెరంబూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో 'సహాయక్ స్కీమ్' ప్రాజెక్ట్‌లో ఎం-యూటీఎస్ ద్వారా అన్ రిజర్వ్‌డ్ రైలు టిక్కెట్లు పొందే సదుపాయం కల్పించారు. ప్రయాణికులకు సౌకర్యవంతమైన, భద్రత కలిగిన ప్రయాణం కల్పించేలా రైల్వే బోర్డు పలు చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో, డిజిటల్ విధానం అందుబాటులోకి రావడంతో అధిక శాతం మంది ప్రయాణికులు ఆన్‌లైన్‌లో టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకుంటున్నారు. అదే సమయంలో, అన్ రిజర్వ్‌డ్ టిక్కెట్ల కోసం స్టేషన్‌లోని క్యూ కౌంటర్ల వద్ద ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితులున్నాయి. దీనిపై దృష్టి సారించిన రైల్వే బోర్డు, దేశవ్యాప్తంగా ఐదు ప్రధాన రైల్వేస్టేషన్లలో 'మొబైల్ అన్‌రిజర్వ్‌డ్ టికెటింగ్ సిస్టమ్ (ఎం-యూటీఎస్) విధానంలో అన్ రిజర్వ్‌డ్ టిక్కెట్లు అందించే సదుపాయం కల్పించింది. ఆ ప్రకారం, బుకింగ్ కౌంటర్ల వద్ద మొబైల్ ఫోన్స్, బ్లూ టూత్ అనుసంధానం చేసిన శిక్షణ పొందిన సహాయకులు, ప్రయాణికులకు అన్ రిజర్వ్‌డ్ టిక్కెట్లు అందజేస్తున్నారు. ఈ విధానంతో ప్రయాణికులు కౌంటర్ల వద్ద వేచి ఉండకుండా సత్వరం టికెట్టు పొందే సౌకర్యం ఉంటుందని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.


అన్ రిజర్వ్‌డ్ టికెట్లు అందజేస్తున్న సహాయకులు



చిత్రజ్యోతి

రాఘవా లారెన్స్ చిత్రంలో పూజా హెగ్డే, నోరా ఫతేహి

'ముని, కాంచనా, కాంచనా2, కాంచనా 3' వంటి హర్రర్ కామెడీ మూవీలను నిర్మించిన ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు రాఘవా లారెన్స్ తాజాగా 'కాంచనా 4' మూవీకి దర్శకత్వం వహించి, హీరోగా నటిస్తున్నారు. రాఘవ సరసన పూజా హెగ్డే, హిందీ నటి నోరా ఫతేహి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ మూవీని సన్‌పిక్చర్స్, గోల్డ్‌మైన్ సంస్థలతోపాటు రాఘవ లారెన్స్‌కు చెందిన రాఘవేంద్ర ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ మూవీ కూడా గత చిత్రాల మాదిరిగానే హర్రర్ కామెడీతో ప్రేక్షకులను ఆకట్టుకుంటుదని హీరో రాఘవా లారెన్స్ తెలిపారు.

'రోజా మల్లి కనకాంబరం' ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల



'పుదియగీతై. కోడంబాక్కం, రామన్ తేడియ సీదై, ఎన్ ఆలోడ సెరుప్పు కానోమ్' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించిన కేపీ జగన్ వాస్తవిక సంఘటన ఆధారంగా రూపొందిస్తున్న మూవీ 'రోజా మల్లి కనకాంబరం'. ఈ మూవీలో ఆయనే హీరోగా నటిస్తున్నారు. విజయ్‌వర్మా, సంగీతా కళ్యాణ్, పిచ్చైకారన్‌మూర్తి, దియా, రంజిత్ వేలాయుధన్, వెట్రివేల్ రాజా, దిండుగల్ అలెక్స్, ఉరియడి శంకర్ ఇతర తారాగణం. ఇటీవల జాతీయ అవార్డు పొందిన ఎంఎస్ భాస్కర్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. మూడు విభిన్నమైన కథల సమ్మేళనమే 'రోజా మల్లి కనకాంబరం' చిత్రమని జగన్ తెలిపారు. ఈ మూవీ షూటింగ్ తిరుచెందూరు, తూత్తుకుడి, మణప్పాడు, కులశేఖరపట్టినం తదితర ప్రాంతాలలో జరిపినట్లు చెప్పారు. 'మాయాండి కుడుంబత్తార్' అనే ఫ్యామిలీ సబ్జెక్ట్ మూవీ నిర్మించిన యునైటెడ్ సంస్థ ఈ సినిమా నిర్మిస్తోంది. ఈ మూవీ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ప్రముఖ దర్శకులు చేరన్, విఘ్నేష్ శివన్ విడుదల చేశారు.

14న కొత్త హంగులతో 'ఆటోగ్రాఫ్' రీ రిలీజ్



రెండు దశాబ్దాల క్రితం తమిళ చిత్ర సీమలో కొత్త సంచలనం కలిగించి, కాలేజీ యువతను బాగా ఆకట్టుకున్న సిల్వర్ జూబ్లీ చిత్రం 'ఆటోగ్రాఫ్'. ప్రేక్షకులను తాము చదివిన పాఠశాలలు, కళాశాలల్లో జరిగిన పాత సంగతులను నెమరువేసేలా అలరించిన ఆ మూవీ మూడు జాతీయ అవార్డులను కూడా కైవసం చేసుకుంది. ప్రస్తుతం ఆ మూవీ డిజిటలైజేషన్‌తో కొత్త హంగులు సిద్ధం చేసుకుని ఈ నెల 14న రీ రిలీజ్ అవుతోంది. ప్రముఖ దర్శకుడు చేరన్ హీరోగా నటించిన ఆ చిత్రానికి టీనేజ్ యువత ఫిదా అయ్యారు. ఆ చిత్రంలో స్నేహ, గోపిక, మల్లిక, కనిక, ఇలవరసు తదితరులు నటించారు. ఈ మూవీలోని 'ఒవ్వొరు పూక్కలుమే' పాట యువతలో ఆత్మ విశ్వాసాన్ని పెంచి, ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. ఆ పాట పాడిన గాయని చిత్రకు, గేయ రచయిత పా విజయ్‌కి జాతీయ అవార్డులు లభించింది. ప్రస్తుతం డిజిటలైజేషన్‌తో మెరుగులు దిద్దుకున్న ఈ మూవీ మళ్ళీ యువతను మైమరపించడం ఖాయమని దర్శకుడు చేరన్ చెబుతున్నారు.

రాజకీయాల్లో నటించకూడదు

● బీజేపీ నేత, నటుడు శరత్‌కుమార్

అడయార్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నటులు రాజకీయాల్లోకి రావచ్చని కానీ, రాజకీయాల్లో నటించకూడదని బీజేపీ నేత, నటుడు శరత్‌కుమార్ అభిప్రాయం వ్యక్తం చేశారు. నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న శరత్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ... మనది ప్రజాస్వామ్య దేశమని, ఎవరైనా రాజకీయాల్లోకి రావచ్చన్నారు. అలాగే, నటులు కూడా రాజకీయాల్లోకి రావచ్చని, వచ్చిన తర్వాత రాజకీయాల్లో నటించకూడదని, నిజాయితీగా వ్యవహరించాలని సూచించారు. రాజకీయాల్లోకి వచ్చిన వారి అర్హత, వారు మాట్లాడే విషయాలు, వారు రాజకీయాల్లోకి వచ్చి ఏం చేయబోతున్నారు? అలా చేసేందుకు వారికి తగిన సామర్థ్యం ఉందా? అనే విషయాలు ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. అలాంటి వారు రాజకీయాల్లోకి వస్తే ప్రజలకు మంచి జరుగుతుందని శరత్‌కుమార్ తెలిపారు.

త్యాగరాజస్వామి ఆలయంలో అన్నాభిషేకం

● భక్తుల కోలాహలం



త్యాగరాజస్వామి ఆలయంలోని శివలింగం

ప్యారీస్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరువారూర్‌లో ప్రసిద్ధి చెందిన త్యాగరాజస్వామి ఆలయంలో మంగళవారం అన్నాభిషేకోత్సవం వైభవంగా నిర్వహించారు. సంగీత మూర్తుల్లో ఒకరైన త్యాగరాజస్వామి కొలుదీరిన ఈ ఆలయంలో ప్రతిఏటా తమిళ ఐప్పసి పౌర్ణమి పర్వదినం ముందురోజు అన్నాభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా జిల్లాలో మిగతా శివాలయాల్లో కూడా శివలింగానికి ప్రత్యేకంగా అభిషేకాలు, భక్తులు కానుకగా సమర్పించిన బియ్యంతో వండిన అన్నం, పండ్లు, కూరగాయలతో అన్నాభిషేకం జరిగింది. త్యాగరాజస్వామి ఆలయంలో ఉన్న మూలవర్ వన్మీగనాథర్‌కు అభిషేక, అలంకార పూజలు నిర్వహించి శివలింగం ముందు అన్నపురాశులు పోసి నివేదించారు. అదేవిధంగా అసలేశ్వర్, కాశీవిశ్వనాథులకు అభిషేకాలు, అలంకరణ, దీపారాధన శాస్త్రోక్తంగా జరిపారు. కమలాలయకుళం తీర్థ కొలనులో ఉన్న నాగనాథస్వామి ఆలయం దుర్గాలయ వీధిలో ఉన్న శివాలయాల్లో నిర్వహించిన అన్నాభిషేకోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకున్నారు. అన్నాభిషేకానికి పెద్దసంఖ్యలో తరలివెళ్లిన భక్తుల శివనామస్మరణలతో తిరువారూర్‌లోని శివాలయాలు మార్మోగాయి.

నేడు అన్ని శివాలయాల్లో....

తమిళ ఐప్పసి నెల అశ్వినీ నక్షత్రయుత పౌర్ణమి సందర్భంగా బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని శివాలయాల్లో అన్నాభిషేకోత్సవం జరగనుంది. కడలూరు జిల్లా చిదంబరం నటరాజస్వామి ఆలయం, తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయం, దిండుగల్ జిల్లా పళని దండాయుధపాణి ఆలయం, తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయం, తంజావూరులో ప్రసిద్ధి చెందిన బృహదీశ్వరాలయం, గంగైకొండ చోళపురం బృహదీశ్వరాలయం తదితర శైవక్షేత్రాల్లో శివపరమాత్మునికి అన్నాభిషేకం జరగనుంది. నవగ్రహాల్లో చంద్రుడికి ప్రీతికరమైన బియ్యంతో వండిన అన్నాన్ని రాశులుగా పోసి పూజల అనంతరం తరలివెళ్లే భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేస్తారు. ఇలా చేస్తే రాష్ట్రంలో వర్షాలు బాగా కురిసి పంటలు సమృద్ధిగా పండి ఆహార కొరత తీరుతుందన్నది భక్తుల ప్రగాఢ విశ్వాసం.

నేవీ హాఫ్ మారథాన్ కోసం రేస్ డే టీ షర్ట్ ఆవిష్కరణ



టీ షర్ట్‌ను ఆవిష్కరిస్తున్న నేవీ ఉన్నతాధికారులు, మారథాన్ నిర్వాహకులు

చెన్నై, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భారత నావికాదళం ఆధ్వర్యంలో ఈ నెల 14న జరుపతలపెట్టిన ఇండియన్ నేవీ హాఫ్ మారథాన్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన రేస్ డే టీ-షర్ట్‌ను ప్రాంతీయ నావికాదళం (తమిళనాడు, పుదుచ్చేరి)ఉన్నతాధికారి కమాండర్ సువరత్ మాగోన్ మంగళవారం ఆవిష్కరించారు. బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంయుక్త సహకారంతో ఈ అందమైన టీ షర్ట్ రూపకల్పన జరిగిందని కమాండర్ సువరత్ మాగోన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా జోనల్ హెడ్, జనరల్ మేనేజర్ టీఎన్ సురేష్, కావేరి హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ అయ్యప్పన్ పొన్నుసామి, రేస్ మేనేజ్‌మెంట్ పార్టనర్ నాగ్‌రాజ్ ఆదిగ తదితరులు పాల్గొన్నారు. మాదక ద్రవ్యాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు వ్యతిరేకంగా, మహిళాశక్తిని కొనియాడే విధంగా ఈ హాఫ్ మారథాన్ నిర్వహించనున్నారు. ఈ మారథాన్ నేపియర్ వంతెన ప్రాంతం నుంచి ఐఎన్ఎస్ అడయార్ బీచ్ దాకా కొనసాగుతుంది. మూడు విభాగాలుగా నిర్వహించనున్న ఈ హాఫ్ మారథాన్‌లో పాల్గొనదలచినవారు chennainavyhalfmarathon.com అనే వెబ్‌సైట్‌లో పేర్లను నమోదుచేసుకోవాలని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు.

అర్హులైన ఓటర్లను తొలగించం

● 'సర్'లో అందరూ పాల్గొనాలి

● రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అర్చనా పట్నాయక్

అర్హులైన వారిని ఓటరు జాబితా నుంచి తొలగించబోమని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అర్చనా పట్నాయక్ స్పష్టం చేశారు. తమిళనాడు సహా పలు రాష్ట్రాల్లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పనులు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఇందుకోసం ఆయా పోలింగ్ కేంద్రాల అధికారులు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సర్వే వివరాలపై రేగుతున్న సందేహాలకు రాష్ట్ర ఎన్నికల అధికారి అర్చనా పట్నాయక్ సమాధానాలిచ్చారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి...

- పెరంబూర్, ఆంధ్రజ్యోతి

ఇంటర్వ్యూ



? ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ఎందుకు

! అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో వుండాలి. అనర్హులు ఓటరు జాబితాలో ఉండరాదు. అనర్హులు అంటే మృతిచెందినవారు, శాశ్వతంగా రాష్ట్రాన్ని విడిచి వెళ్లినవారు అని అర్థం.

? 'సర్' పనులు ఏమిటి

! సర్ పనులు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. పోలింగ్ అధికారులు ఇంటింటికీ వెళ్లి జాబితాలోని ఓటర్ల వివరాలు పరిశీలిస్తారు. అధికారులు అడిగే ప్రశ్నలు లేదా ఇచ్చే ఫారంలోని వివరాలు పూర్తిచేయాల్సి ఉంటుంది. అందుకు ఎలాంటి సర్టిఫికెట్లు అవసరం లేదు.

? ఫారంలో ఏఏ అంశాలు ఉంటాయి

! ప్రస్తుతం ఓటరు జాబితాలోని అంశాల ఆధారంగా ఆ ఫారం ఉంటుంది. అందులో ఓటరు నెంబరు, తల్లిదండ్రుల ఓటరు నెంబరు, తదితరాలు పూర్తిచేయాల్సి ఉంటుంది. అవసరమనుకుంటే తమ తమ కొత్త ఫొటో ఫారంలో జతచేసి అందించవచ్చు.

? ఆ ఫారాలను పోలింగ్ కేంద్రం అధికారుల ఏం చేస్తారు

! ఆ ఫారాలు స్వీకరించి, వాటిలోని వివరాలు పరిశీలించి, దానికి సంబంధించిన యాప్‌లో వాటిని అప్‌లోడ్ చేస్తారు. ఈ పనులు సులభంగా చేసేలా క్యూ ఆర్ సదుపాయం కూడా కల్పించాము. ఓటరు పేరు, గుర్తింపుకార్డు నెంబరు ఆధారంగా 2002, 2005 ఓటరు జాబితాను పరిశీలించి, సరిచేయడం జరుగుతుంది. ఆయా ఓటర్ల జాబితా తర్వాత ఓటర్లుగా నమోదైన వారి, తల్లిదండ్రుల ఓటరు జాబితా నెంబరు పరిశీలించి, వారి పేర్లు జతచేయడం జరుగుతుంది.

? ఒకవేళ 2002, 2005 జాబితాలో వారి పేర్లు లేకపోతే

! వారి పేర్లు వేరే ఏ నియోజకవర్గంలో అంతకు ముందున్నాయా అని పరిశీలించి ఓటరు జాబితాలో జతచేస్తాం. ఒకవేళ పేరు లేకుంటే, వారి తల్లిదండ్రుల గుర్తింపు కార్డు, వారు నివసించే ప్రాంతం, వారి ఓటరు గుర్తింపు కార్డు తదితరాలు పరిశీలిస్తాము. ఒకవేళ వాటిలో పేరు లేకపోతే ముసాయిదా ఓటరు జాబితాలో పేరు చేర్చే అవకాశం లేదు. మళ్లీ వారు తగిన పత్రాలతో దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది.

? సర్వేకు వెళ్లిన సమయంలో ఇంటికి తాళం వేసి ఉంటే

! ఒక్కో ఇంటికి అధికారులు మూడు సార్లు వెళ్తారు.

? ఒకవేళ ఓటరు చిరునామా మారితే

! నియోజకవర్గం మారి ఉంటే వారి పేరు ముసాయిదా ఓటరు జాబితాలో ఉండదు. అలాంటి విషయాల్లో డిసెంబరు 9 నుంచి జనవరి 8వ తేది వరకు చిరునామా మార్పుకు సంబంధించి తగిన పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

? నగరాల్లో పని చేసేవారికి తమ సొంతూరిలో ఓటు హక్కుంటే

! ఆ విషయంలో ఎలాంటి సమస్యలుండవు. ఈ సర్వేలో అందజేసే ఫారంను ఆయా ఓటర్లకు బదులుగా సొంతూరిలో వున్న తల్లిదండ్రులు పూర్తిచేసి ఇస్తే సరిపోతుంది. కానీ, నగరంలోని ఓటరు జాబితాలో పిల్లల పేరుండకూడదు. అలా రెండు చోట్ల నమోదు అయితే మాత్రం, ఒక చోట మాత్రమే సర్వే ఫాం అందజేయాల్సి ఉంటుంది.

? అర్హులైన ఓటర్లను జాబితా నుంచి తొలగించడం సాధ్యమా

! ఈ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, రాజకీయ పార్టీల ఏజెంట్లు కలసి పనిచేయనున్నారు. అర్హులైన వారిని ఓటరు జాబితా నుంచి తొలగించే ప్రసక్తే లేదు. ఒక వ్యక్తి పేరు తొలగించాలంటే అందుకు గల కారణం స్పష్టంగా తెలపాలి. మృతిచెందిన వారు గాని, చిరునామా లేకపోవడం తదితరాల కారణంగానే తొలగిస్తారు. ఈ వివరాలను గ్రామ, నగర ప్రకటన బోర్డు ప్రజలకు తెలిసేలా ప్రకటిస్తారు.

? దీనిపై ప్రజలకు మీరిచ్చే సూచన

! సమగ్ర సవరణ ఫారాన్ని ప్రజలు అందుకుని, వాటిలోని వివరాలు పూర్తిచేసి సమర్పించాలి. ఒక వేళ ఫారం ఇవ్వని పక్షంలో ముసాయిదా ఓటరు జాబితా నుంచి వారి పేర్లు తొలగించడం జరుగుతుంది. ఒకవేళ, చిరునామా మారినవారి పేర్లు కూడా ముసాయిదా ఓటరు జాబితాలో ఉండవు. అలాంటి వారు నిర్దిత కాలంలో దరఖాస్తు చేసుకుంటే, దానిని పరిశీలించి ఓటరు జాబితాలో చేర్చడం జరుగుతుంది. అర్హులైన వారి పేర్లు ఎట్టి పరిస్థితుల్లోను ఓటరు జాబితా నుంచి తొలగించే ప్రసక్తే లేదు.

? కొత్త వారు ఓటరుగా నమోదుచేసుకోవచ్చా

! సర్వే ఫారం అందజేసే సమయంలో 18 ఏళ్లు పూర్తయిన వారిని మాత్రమే చేర్చడం జరుగుతుంది. అందుకోసం తల్లిదండ్రుల ఓటరు నెంబరు, అఫిడవిట్, ఫారం 6 మాత్రమే అందజేయాలి. ఎటువంటి పత్రాలు అవసరం లేదు. కానీ వారి పేర్లు నమూనా ఓటరు జాబితాలో చేర్చబడవు. అభ్యంతరాల సమయంలో, ఈ ఫారం పరిశీలించి, వారు అర్హులైతే, వారిని తుది ఓటరు జాబితాలో చేర్చవచ్చు.

'సర్' ప్రక్రియ ప్రజా వ్యవస్థగా మారాలి

● బీజేపీ నాయకురాలు తమిళిసై



పుస్తకావిష్కరణ సభలో తమిళిసై, కరాటే త్యాగరాజన్ తదితరులు

ప్యారీస్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ ప్రజా వ్యవస్థగా మారాలని బీజేపీ సీనియర్ నాయకురాలు, మాజీ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ అభిప్రాయపడ్డారు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల ముందే పూర్తిచేయనున్న సర్ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించేలా 'ఓటరు బలం' అనే పేరుతో ఆమె రచించిన పుస్తకావిష్కరణ సభ తిరువొత్తియూర్‌లో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో తమిళిసై మాట్లాడుతూ, మంగళవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన సర్ ప్రక్రియ వల్ల ఓటు హక్కు కోల్పోయే ప్రమాదముందని ముఖ్యమంత్రి స్టాలిన్ సహా డీఎంకే మిత్రపక్షాల నేతలు ప్రజలను తప్పుదారి పట్టించేలా విమర్శించడం తగదన్నారు. సర్ ద్వారా 18యేళ్లు నిండిన యువతను కొత్తగా ఓటరు జాబితాలో చేర్చడం మాత్రమేనని, ఇది ఓటు హక్కు కలిగివున్న వారి పేర్లను తొలగించడం కాదన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో సెయింట్ జార్జికోటలో రెండాకులతో కమలం వికసిస్తుందని, దీనిని ఎవ్వరూ అడ్డుకోలేరని ఆమె ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విజయ తరణి, మాజీ మేయర్ కరాటే త్యాగరాజన్, పి.రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజల అభివృద్ధే డీఎంకే లక్ష్యం

● డిప్యూటీ సీఎం ఉదయనిధి



కళాకారులకు ప్రోత్సాహకాలను అందజేస్తున్న ఉదయనిధి, కదిర్ ఆనంద్, శక్తిఅమ్మ తదితరులు

వేలూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల అభివృద్ధే డీఎంకే లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పేర్కొన్నారు. వేలూరు కోట ప్రాంగణంలో మంగళవారం ఉదయం నిర్వహించిన సభలో ఉదయనిధి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పలుశాఖల అధికారులతో కలిసి జిల్లాలోని అభివృద్ధి పథకాలకు సంబంధించిన పనులను ప్రారంభించారు. ఈ క్రమంలో, రాష్ట్ర నీటిపారుదల శాఖ, మహిళా సంక్షేమశాఖ, గ్రామీణాభివృద్ధిశాఖ, పంచాయతీశాఖల్లో రూ.11.80కోట్ల పథకాలకు, పీడబ్ల్యూడీ శాఖలో రూ.17.91కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం లబ్ధిదారులకు రూ.414.15 కోట్ల విలువైన సంక్షేమ సహాయాలను పంపిణీ చేశారు. పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలో రూ.5.23 కోట్లతో చేపట్టిన మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ముఖ్యమంత్రి ప్రత్యేక పరీక్షలో గెలుపొందిన 8 మందికి ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సంక్షేమానికి డీఎంకే ప్రభుత్వ పలు పథకాలను ప్రవేశపెట్టిందని, ప్రజలంతా డీఎంకే వైపే ఉన్నారని, అయినప్పటికి ప్రతిపక్షాలు అధికారపార్టీపై చేస్తున్న విమర్శలు ఆగడంలేదన్నారు. వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో మళ్లీ డీఎంకే ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఏపీ.నందకుమార్, కార్తికేయన్, అమ్ములు, ఈశ్వరప్పన్, ఎంపీ కదిర్ ఆనంద్, జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి, మేయర్ సుజాత, పంచాయతీ అధ్యక్షుడు బాబు, డీఆర్‌వో మాలతి సహా పలుశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నారాయణి పీఠంలో... : వేలూరు సమీపంలోని కోటి నారాయణి పీఠంలో మంగళవారం ఉదయం ఆలయ వ్యవస్థాపకులు శక్తిఅమ్మ 50వ జన్మదినం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం ఉదయనిధి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 500 మంది కళాకారులకు ప్రోత్సాహకాలను ఉదయనిధి అందజేశారు. ఈ సందర్భంగా శక్తిఅమ్మ మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి ఉదయనిధి తమ ఆహ్వానం మేరకు తన జన్మదిన వేడుకలకు రావడం సంతోషంగా ఉందన్నారు. అలాగే దివంగత మాజీముఖ్యమంత్రి కరుణానిధి కుటుంబ సభ్యులతో తనకు ఎంతో స్నేహపూర్వకమైన సంబంధాలున్నాయన్నారు. అనంతరం దివ్యాంగులకు ద్విచక్ర వాహనాలను ఉదయనిధి పంపిణీ చేశారు.



విద్యార్థికి ప్రోతాహం చెక్ అందజేస్తున్న డిప్యూటీ సీఎం ఉదయనిధి



దివ్యాంగులకు ద్విచక్ర వాహనాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

కూటమి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

● బీజేపీ శిక్షణ శిబిరంలో నయినార్ నాగేంద్రన్



ప్రారంభోత్సవంలో నయినార్ నాగేంద్రన్, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, బైజయంత్ పాండా తదితరులు

ప్యారీస్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయమే లక్ష్యంగా పనిచేయాలని, బీజేపీ రాష్ట్ర నాయకులు, ఎన్నికల ఇన్‌చార్జీలు, బూత్ కమిటీల ప్రతినిధులకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే నయినార్ నాగేంద్రన్ సూచించారు. రాయపేటలోని వైఎంసీఏ హాలులో రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ ఏజెంట్ల శిక్షణ శిబిరాన్ని మంగళవారం నయినార్ నాగేంద్రన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల నిర్వాహకులు బైజయంత్ పాండా, మురళీధరన్ మోహల్, రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి డా.పొంగులేటి సుధాకర్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి పొన్ రాధాకృష్ణన్, సీనియర్ నాయకులు అన్నామలై, హెచ్.రాజా, తమిళిసై సౌందరరాజన్, కరాటే త్యాగరాజన్, బీజేపీ మహిళా విభాగం రాష్ట్రఅధ్యక్షురాలు వానతీ శ్రీనివాసన్ తదితరులు హాజరయ్యారు. ఈ శిక్షణ శిబిరంలో చెన్నై, కన్నియాకుమారి, మదురై, కోవై, తిరుచ్చి, వేలూరు, విల్లుపురం, సేలం, తంజావూరు, నామక్కల్, కృష్ణగిరి, ధర్మపురి తదితర జిల్లాలనుండి సుమారు వెయ్యి మందికి పైగా బీజేపీ బూత్ ఏజెంట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నయినార్ నాగేంద్రన్ మాట్లాడుతూ, పోలింగ్ బూత్ ఏజెంట్లు తమకు కేటాయించిన నియోజకవర్గాల్లో సర్ ప్రక్రియ సజావుగా సాగేలా వ్యవహరించాలని, ఈ ప్రక్రియలో ఏమైనా కొరతలుంటే వెంటనే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లలని సూచించారు.

శిబిరానికి హాజరైన బీజేపీ కార్యకర్తలు



శ్రీవారి విరాళంగా వెండి గంగాళం



తిరుమల, నవంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి మంగళవారం వెండి గంగాళం విరాళంగా అందింది. హైదరాబాద్‌కు చెందిన జక్కారెడ్డి శ్రీనివాసులురెడ్డి అనే భక్తుడు 22 కేజీల బరువున్న రూ.30 లక్షల విలువైన గంగళాన్ని టీటీడీ అధికారులకు అందజేశారు. అంతకుముందు అదనపు ఈవో వెంకయ్య చౌదరిని ఆయన కలిసి వివరించారు.

తిరుపతి శ్రీకాలేజీ స్థానంలో యూనివర్శిటీ




● తెలంగాణ ఎమ్మెల్యే మల్లారెడ్డి

తిరుమల, నవంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శ్రీకాలేజీని కొనుగోలు చేశానని, ఈస్థానంలో యూనివర్సిటీ పెట్టాలనే కోరికతో తిరుమల శ్రీవేంకటేశ్వరుని దర్శించుకుని మొక్కుకున్నట్టు తెలంగాణ ఎమ్మెల్యే మల్లారెడ్డి తెలిపారు. తిరుమల శ్రీవారిని మంగళవారం ఉదయం దర్శించుకున్న ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశమంతా యూనివర్సిటీలు ఏర్పాటు చేయాలనే ఆలోచనతో వైజాగ్‌లో ఇప్పటికే యూనివర్శిటీ నెలకొల్పామన్నారు. తిరుపతి శ్రీ ఇంజనీరింగ్ కాలేజీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తయిందని తెలిపారు. మల్లారెడ్డి మాట్లాడుతుండగా కొందరు 'జై తెలంగాణ' అంటూ నినాదాలు చేశారు.

నేడు కార్తీక పున్నమి గరుడసేవ

తిరుమల, నవంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుమలలో బుధవారం గరుడవాహనంపై శ్రీమలయప్పస్వామి దర్శనమివ్వనున్నారు. ప్రతి నెలా పౌర్ణమిరోజున టీటీడీ గరుడసేవను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. బుధవారం కార్తీక పౌర్ణమి కావడం విశేషం. రాత్రి 7 గంటలకు వాహనసేవ ప్రారంభంకానుంది.

సర్వదర్శనానికి 8 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 15 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.74 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,322

తలనీలాలు సమర్పించినవారు: 26 వేలు

విడిదికి వేళాయె!

వలస పక్షులకు స్వాగతం పలుకుతున్న నేలపట్టు



పెలికాన్‌లు (గూడబాతులు)



వైట్ఐబీస్(తెల్లకంకణాయి)



పుల్లలు ఏరుకుంటూ

ఓపెన్ బిల్డ్‌స్టార్క్స్(నత్తగుల్ల కొంగలు)

గూళ్ళు సర్దుకుంటూ

దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి


వలసపక్షుల విడిది కేంద్రం నేలపట్టులో సందడి మొదలైంది. వేల కిలోమీటర్ల దూరాల నుంచి ఎగురుకుంటూ వస్తున్న పక్షులకు స్వాగతం పలుకుతోంది. అక్టోబరు 20 తర్వాత పక్షుల రాక పలుచగా మొదలైనా వారం నుంచీ వీటి సంఖ్య పెరిగింది. నిజానికి అక్టోబరు మొదటి వారం నుంచే వలసవిహంగాల రాక మొదలు కావాలి. నేలపట్టు చెరువుల్లోని పచ్చని కడప చెట్ల మీద తెల్లని పత్తిపూలలా కొంగలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది వానలు బాగా కురిశాయి. చెరువులు కళకళలాడుతున్నాయి. పులికాట్ సరస్సుకూడా నీటితో నిండుగా ఉంది. దీంతో ఈ యేడాది పెలికాన్ పక్షుల సంఖ్య భారీగా ఉంటుందని అటవీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఆస్ట్రేలియా, శ్రీలంక, దక్షిణాఫ్రికా దేశాల నుంచి పెలికాన్ పక్షులు నేలపట్టుకు వస్తాయి. కడప చెట్లపై గూళ్లు అల్లుకుని, జత వెతుక్కుని, గుడ్లు పెట్టి, పొదిగి తమ సంతతి వృద్ధి చేసుకొంటాయి. నేలపట్టు చెరువుల్లోని చెట్లమీద అయిదారు నెలలపాటూ ఉండే పక్షులు, తెల్లవారగానే రెక్కలు విప్పుకుని ఇక్కడికి 10 నాటికల్ మైళ్ళ దూరంలోని పులికాట్ సరస్సులోకి వెళ్లిపోతాయి. ఈ కాలంలో చేపలూ, రొయ్యలూ పులికాట్‌లో సంవృద్ధిగా ఉంటాయి. కడుపు నిండా తిని తమ మెడకింది గూళ్లలో మత్స్యఆహారం దాచుకుని సాయంత్రానికి తిరిగి నేలపట్టుకు చేరుకుని విశ్రమిస్తాయి. ప్రస్తుతం ఎండిన పుల్లలు ఏరుకుంటూ, గూళ్లకు చేరుస్తూ, ఈదులాడుతూ, నింగిలో విన్యాసాలు చేస్తూ జతను ఆకర్షిస్తూ నేలపట్టులో సందడి చేస్తున్నాయి. నీటి అడుగు భాగంలో దొరికే పీచులాంటి గడ్డిని సేకరించి గూళ్లలో మెత్తగా పరచుకుంటున్నాయి. పక్షుల రాక ప్రారంభం కావడంతో స్థానిక వన్యప్రాణి సంరక్షణ శాఖ అధికారులు సందర్శకులను అనుమతిస్తున్నారు.



జతను ఆకర్షించే విన్యాసాలు

విడిదికి చేరుకున్న పక్షులు ఇవీ

పక్షి పేరు	2024	2025
	(నవంబర్ 1 నాటికి)	
పెలికాన్స్ (గూడబాతులు)	921	1026
ఒపన్ బిల్డ్ స్టార్క్స్(నత్తగుల్లకొంగలు)	1547	2384
వైట్ ఐ బీస్(తెల్లకంకణాయి)	1364	1064
లిటిల్ కార్మోరెంట్స్ (చిన్ననీటి కాకులు)	432	622
స్పూన్ బిల్స్ (తెడ్డుమూతి కొంగలు)	02	52
మొత్తం	4266	5148



పెలికాన్ జంట విహారం



పక్షుల రాక మొదలవడంతో సందర్శనకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే పక్షుల కేంద్రంలోని అన్నీ ర్లోను శుభ్రపరిచే పనులు ప్రారంభించాం. పక్షుల సంఖ్యతో పాటు, సందర్శకుల సంఖ్య కూడ రోజు రోజుకీ పెరుగుతుంది. నేలపట్టు ఆహ్లాదకరమైన ప్రదేశం. ప్రశాంతంగా పక్షుల విన్యాసాలు వీక్షించవచ్చు.

- ఎ. సౌజన్య, నేలపట్టు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్



ప్రేమకలాపాలు



గూళ్లలో విశ్రాంతి



కడప చెట్లపై కొలువు దీరిన వలస పక్షులు



లిటిల్ కార్మోరెంట్స్(చిన్న నీటి కాకులు)

పంచాయతీనిధుల దుర్వినియోగంపై ఇరువర్గాల ఘర్షణ

● ఇద్దరికి గాయాలు

కేవీబీపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పవనివారికండ్రిగలో పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారంటూ ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాలు... పవనివారికండ్రిగకు చెందిన శ్రీనివాసులు అలియాస్ వాసు గ్రామంలో పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని ఈనెల 3న సోమవారం చర్చించడంపై సర్పంచు వర్గానికి చెందిన చెంచుబాబు మధ్య వాగ్వాదం జరిగింది. మంగళవారం ఉదయం వాసు పెద్దమ్మ బుజ్జమ్మ తన మరిది వెంకటేశ్వర్లును ఎందుకు బెదిరించారంటూ నిలదీశారు. ఈక్రమంలో మునిరామయ్య, చెంచుబాబు, చెంచుకృష్ణ తదితరులు శ్రీనివాసులు చిన్నాన్న సుబ్రహ్మణ్యంపై దాడి చేశారు. శ్రీనివాసయాదవ్ అడ్డుపడగా అతనిపై కూడా కర్రలతోదాడి చేశారు. ఈ దాడుల్లో శ్రీనివాసయాదవ్, చెంచుబాబు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పుత్తూరు డీఎస్పీ రవికుమార్, సీఐ రవీంద్ర, పిచ్చాటూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ నరేష్ సిబ్బందితో గ్రామానికి చేరుకుని పరిస్థితిని సర్దుబాటు చేశారు. క్షతగాత్రులను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ముందస్తు చర్యగా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.



శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చెంచుబాబు



శ్రీనివాసయాదవ్

బీజేపీ జెండాతో తిరుమలకు కారు



పార్టీ జెండాతో ఉన్న కారు

తిరుమల, నవంబరు4(ఆంధ్రజ్యోతి): టీటీడీ నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ పార్టీ జెండాతో మంగళవారం ఓ కారు తిరుమలలో కనిపించింది. అలిపిరి తనిఖీలను దాటుకుని బీజేపీ జెండాతో తిరుమలకు చేరుకున్న కారు వరాహస్వామి విశ్రాంతి భవనం వద్ద కనిపించింది.

వైద్యాధికారి తీరుపై విచారణ

వెంకటగిరి, నవంబర్ 4(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ప్రభుత్వాస్పత్రి ఇన్‌చార్జి వైద్యాధికారి జిలానీ బాషా తీరుపై మంగళవారం విచారణ జరిగింది. రోగులకు సరైన వైద్యం అందించడం లేదని, సహచర వైద్యులు, సిబ్బందిని వేధింపులకు గురిచేస్తున్నారని జిలానీ బాషాపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఇటీవల ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆ సమయంలో వైద్యాధికారి జిలానీ బాషా తీరుపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉన్నతాధికారుల బృందం ఆస్పత్రికి చేరుకొని విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది, జిలానీ బాషా వేధింపుల గురించి అధికారుల బృందానికి వివరించారని సమాచారం. సిబ్బంది చెప్పినవి విషయాలు నమోదు చేసుకోవడంతో పాటు ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించి నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు విచారణాధికారులు తెలిపారు. ఈ విచారణ బృందంలో గూడూరు ఏరియా ఆస్పత్రి సివిల్ సర్జన్ డి.రాజా, పరిపాలనా అధికారి బి.కమల్ కిరణ్, సూళూరుపేట ఏరియా ఆస్పత్రి జూనియర్ అసిస్టెంట్ ఎల్‌కే కరీనా ఉన్నారు.



వైద్యాధికారి జిలానీ బాషాతో మాట్లాడుతున్న విచారణాధికారులు

హైవే, రైల్వే ప్రాజెక్టు భూసేకరణ పనులు వేగవంతం చేయండి

● అధికారులకు కలెక్టర్ ఆదేశం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు, వైజాగ్ - చెన్నై కారిడార్ పైపులైను పనులు, పలు భూసంబంధిత పెండింగ్ నిర్మాణ పనులను ప్రణాళిక బద్ధంగా నిర్ణీత గడువు లోపు పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. తిరుపతి కలెక్టరేట్‌లో మంగళవారం తిరుపతి, నెల్లూరు, చెన్నై నేషనల్ హైవే పీడీలు, ఆర్డీవోలు తదితర అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో చేపడుతున్న జాతీయ రహదారుల నిర్మాణ పనులు, వైజాగ్ - చెన్నై కారిడార్ పైపులైను పనులు, రైల్వే ప్రాజెక్టు పనులు, పురోగతిలో ఉన్న పనులపై రేణిగుంట, పూడి, గూడూరు, రేణిగుంట, పాకాల, తిరుపతికి సంబంధించి రైల్వే ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలన్నారు. పెండింగ్ భూసమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీవోలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామ్మోహన్, కిరణ్మయి, భానుప్రకాష్‌రెడ్డి, తిరుపతి, నెల్లూరు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్లు విజయభరత్‌రెడ్డి, శివకుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

జిల్లా యంత్రాంగానికి అభినందనలు

మొంథా తుఫాన్ సహాయక చర్యల్లో పాల్గొని సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేసిన జిల్లా యంత్రాంగానికి కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. రానున్న రెండు నెలలు ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, వ్యవసాయశాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన ప్రతి అర్జీని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీ రోజ్మాండ్, ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

మరింత సమర్థంగా వ్యర్థాల నిర్వహణ

● స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్

తిరుపతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్‌ను మరింత అభివృద్ధి చేస్తున్నామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. మంగళవారం పద్మావతి అతిథి గృహంలో నగరపాలక సంస్థ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. చెత్త సేకరణ, తరలింపు, ప్రాసెసింగ్ తదితర విషయాలను డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్‌లు ఆయనకు వివరించారు. అనంతరం పట్టాభిరామ్ మీడియాతో మాటాడుతూ గత ప్రభుత్వం వదిలేసిన కొన్ని వేల టన్నుల చెత్తను శుభ్రం చేస్తున్నామన్నారు. చెత్త శుభ్రం చేసిన ప్రాంతాలను సుందరమైన పార్కులుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఏపీజీబీసీ చైర్మన్ సుగుణమ్మతో కలసి పార్కులు పెంచి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం తెచ్చేలా చర్యలు చేపడుతున్నామన్నారు. తూకివాకంలోని ఇంటిగ్రెటెడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్‌ను తమ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. రీసైక్లింగ్ ఫ్యాక్టరీలు కూడా తిరుపతి ప్రాంతాల్లో రానున్నాయని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మునిసిపల్ ఇంజినీర్ తులసికుమార్, డీఈ రమణ, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య, తదితరులు పాల్గొన్నారు.

21 కిలోల గంజాయి స్వాధీనం ఒడిశాకు చెందిన ఇద్దరి అరెస్టు

పెళ్లకూరు, నవంబరు, 4 (ఆంధ్రజ్యోతి): బేల్దారి పనుల ముసుగులో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఒడిశాకు చెందిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నాయుడుపేట సీఐ సంగమేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు... పెళ్లకూరు మండలంలోని 71వ జాతీయ రహదారిలో తాళ్వాయిపాడు అండర్ పాస్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరిని సోమవారం సాయంత్రం ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా ఒడిశా రాష్ట్రం, కలహండి జిల్లా, పండకమాల్ గ్రామానికి చెందిన గోపీనాథ్ బీబార్, మితిన్ బీబార్‌గా తెలిసింది. వారివద్ద నుంచి 21 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తిరుపతిలో బేల్దారు పనులు చేసుకుంటున్న పండకమాల్ గ్రామానికి బలరాం వద్ద గోపీనాథ్ బీబార్, మితిన్ బీబార్ ఇటీవల పనిలో చేరారు. గంజాయి అక్రమ రవాణా చేసి ఎక్కువ డబ్బు సంపాదించవచ్చని సావీర్ అనే వ్యక్తి వీరికి ఆశ చూపాడని విచారణలో తెలిసింది. నిందితులు ఇద్దరినీ నాయుడుపేట కోర్టులో హాజరుపరచినట్లు సీఐ తెలిపారు.



గంజాయి, నిందితులతో సీఐ సంగమేశ్వరరావు, ఎస్ఐ నాగరాజు

శ్రీవారి సేవలో ప్రముఖులు



జస్టిస్ ఈశ్వరయ్య

తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య, ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ఉన్నారు.

-తిరుమల, ఆంధ్రజ్యోతి



నిమ్మగడ్డ రమేష్‌కుమార్